ప్రజాశక్తి

ఆదివారం 18 జూన్ 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

బియ్యం కార్డు ఉంటేనే ఆరోగ్యశ్రీ

అమలు కాని రూ.ఐదు లక్షల పరిమితి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో ఐదు లక్షల వరకూ ఆదాయం ఉన్నా ఆరోగ్య శ్రీ కార్డులు ఇస్తామని సీఎం జగన్ ప్రకటన ఆచరణలో అమలు కావడం లేదు. ప్రభుత్వం విధించిన ఆంక్షల వల్ల రూ.2 లక్షల లోపు ఆదాయం ఉన్నా ఆరోగ్యశ్రీ కార్డు పొందేందుకు అర్హత లేదంటున్నారు. బియ్యం కార్డు ఉన్న వారికే ఆరోగ్యశ్రీ కార్డు కూడా వస్తుందని లేదంటే కుటుంబంలో ఎవ్వరూ ప్రభుత్వ పింఛను, లేదా ఇతర ఆరుసూత్రాల ఆంక్షలు వర్తింపచేస్తున్నారు. కారు సౌకర్యం ఉన్నా ఆరోగ్య శ్రీ కార్డు ఇస్తామని ప్రకటించిన ఆచరణలో అందుకు భిన్నం గా వ్యవహరిస్తోందని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. బియ్యం కార్డు ఉంటేనే ఆరోగ్య శ్రీ దరఖాస్తులు పూర్తి చేయాలని వాలంటీర్లకు ఆదేశాలు వచ్చాయి. ఇప్పటి వరకూ రేషన్ కార్డులు లేని వారికి ఆధార్ కార్డు,స్థానిక చిరునామా, గ్యాస్ కార్డు, విద్యుత్ బిల్లు జిరాక్స్‌లు జతచేయాలని వాలంటీర్లు దరఖాస్తు దారులను కోరుతున్నారు. ఆరు నెలల పాటు సగటున 300 యూనిట్లు విద్యుత్ వినియోగిస్తే తెల్లరేషన్ కార్డు దక్కదని స్పష్టం చెబుతున్నారు. అయితే పేద వర్గాల్లో కూడా రెండు మూడు పోర్షన్‌లకు ఒకే మీటరు ఉండటం వల్ల నెలకు 300 నుంచి 400 యూనిట్లు వరకూ బిల్లులు వస్తున్నాయి. అలాగే అత్యంత మధ్య తరగతి ప్రజలు కూడా వృద్ధులు ఉన్న ఇళ్లలో వారి ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా ఎసిలు వినియోగిస్తున్నారని వీరికి నెలకు సగటున 400 యూనిట్లు వరకూ విద్యుత్ బిల్లులు వస్తున్నాయని చెబుతున్నారు. ఇప్పటికే రేషన్ కార్డుల కోసం కుటుంబాల విభజన జరుగుతోంది. ఇప్పుడు విద్యుత్ బిల్లుల దెబ్బకు మీటర్ల విభజన పెరుగుతోంది. తెల్లకార్డు ఉంటేనే పక్కా ఇల్లు, ఇంటి స్థలం, రేషన్, ఇతర సంక్షేమ వర్గాలతో పాటు ఆరోగ్యశ్రీ కూడా అమలు అవుతాయని ఈ కార్డు లేని వారి నుంచి దరఖాస్తుల స్వీకరణపై ఇంకా స్పష్టత రాలేదని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో విద్యుత్ బిల్లుల నిబంధన వల్ల తెల్లకార్డుల కుదింపునకు అవకాశం ఏర్పడింది. బియ్యం కార్డుతోసంబంధం లేకుండా రూ.5 లక్షల లోపు ఆదాయం కల్గినవారికి ఆరోగ్యశ్రీ ఇస్తామని చెప్పినా కుటుంబంలో ఎవరైనా బియ్యం కార్డునకు అనర్హులు ఉంటే ఈకుటుంబంలో ఎవరికి ఆరోగ్యశ్రీ ఇవ్వని పరిస్థితినెలకొంది. ప్రధానంగా ప్రభుత్వం పింఛనర్లకు చాలా ఇబ్బంది కరంగా మారిందంటున్నారు. అలాగే విద్యార్థులకు రుణాలు పొందే వారు ఐటి రిటర్ను ఉన్నా వారిని అనర్హులుగా తేలుస్తున్నారు. 2018లో ప్రజా సాధికర సర్వేపేరుతో కుటుంబాలు,నివాసాలను చేసిన మ్యాపింగ్‌ను ప్రస్తుత ప్రభుత్వం కూడా పరిగణలోకి తీసుకుంటోంది. అలాగే ఆరుసూత్రాల ఆంక్షల విధానం వల్ల చాలామందికి బియ్యం కార్డు లేక ఆరోగ్యశ్రీతోపాటు ఇతర సంక్షేమ పథకాలుకూడా కోల్పోతున్నారు.





నిరసన కార్యక్రమంలో పాల్గొన్న వివిధ పార్టీల కార్యకర్తలు, నాయకులు

విద్యుత్ భారాలపై పోరుబాట

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించకపోతే ప్రజా ఉద్యమం తప్పదని ప్రభుత్వానికి హెచ్చరిక

గుంటూరులో రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నిరసన

ప్రజాశక్తి-గుంటూరు

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించకపోతే ప్రజా ఉద్యమం తప్పదని వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు హెచ్చరించారు. విద్యుత్ ఛార్జీల పెంపును వ్యతిరేకిస్తూ శనివారం స్థానిక శంకర్‌విలాస్ సెంటర్ వద్ద నిరసన కార్యక్రం నిర్వహించారు. సిపియం, నగర కార్యదర్శులు కె.నళినీ కాంత్, కె.మాల్యాద్రి అధ్యక్షతన జరిగిన ఈ నిరసనలో సిపియం, సిపిఐ జిల్లా కార్యదర్శులు పాశం రామారావు, జంగాల అజయ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు షేక్ మస్తాన్ వలి, సిపిఐ (ఎంఎల్) రెడ్ స్టార్ పొలిట్ బ్యూరో సభ్యులు మన్నవ హరిప్రసాద్, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు నరసింహారావు, బీఎస్పీ జిల్లా నాయకులు వాసు, విసికె పార్టీ నాయకురాలు జయసుధ తదితరులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సర్దుబాటు చార్జీలు, ట్రూ అప్ చార్జీలు, ఇంధన చార్జీల పేరుతో విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెంచి ప్రజలపై భారాలు మోపటం సరికాదని అన్నారు. మరోవైపు నిత్య జీవితావసర సరుకుల ధరలు, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు పెరిగిపోయాయని, ప్రజలు ఇబ్బందులు పడుతుంటే విద్యుత్ ఛార్జీలు పెంచడం దారుణం అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యుత్ చార్జీలు పెంపును ఉపసంహరించు కోవాలని లేనిచో ఆందోళన ఉధతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించే ప్రక్రియకు శ్రీకారం చుట్టిందని భవిష్యత్తులో వ్యవసాయానికి ఇచ్చే ఉచిత విద్యుత్తును రద్దు చేసే ప్రమాదం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యుత్తు సంస్కరణ చట్టం చేసి విద్యుత్ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించే చర్యలు చేపడుతుందన్నారు. గహాలకు పరిశ్రమలకు వ్యాపార సంస్థలకు స్మార్ట్ మెటల్ బిగించి ప్రతినెలా విద్యుత్ ఛార్జీలు పెంచేందుకు చర్యలు చేపడు తుందన్నారు ఈ విధానాలకు వ్యతిరేకిం చాలని వివిధ రాజకీయ పార్టీలు పిలుపునిచ్చాయి. ఈ కార్యక్రమ ంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి కళ్ళం రాజశేఖర్ రెడ్డి, సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షులు కే శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కే అజయ్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి ఎంఎ చిష్టీ, రిపబ్లిక్ పార్టీ నాయకులు ముత్తయ్య, ఆంధ్ర మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి తాడికొండ నరసింహారావు, అంబేద్కర్ యూత్ రాష్ట్ర కార్యదర్శి బత్తుల వీరస్వామి, సిపిఐ నగర నాయకులు అరుణ్ కుమార్, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం హనుమంతరావు, సిఐటియు నగర కార్యదర్శి కే శ్రీనివాసరావు, నాయకులు ఆది నికల్సన్, టిడిపి అంగన్వాడి విభాగం నాయకు రాలు విజయలక్ష్మి, యస్.యఫ్.ఐ నగర కార్యదర్శి సమీర్ తదితరులు పాల్గొన్నారు.

దారిమళ్లుతున్న రేషన్ బియ్యం



8లో

నేడు రెండవ ఎంఇఒ పోస్టుల భర్తీకి కౌన్సెలింగ్

ప్రజాశక్తి-గుంటూరు : రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఉమ్మడి గుంటూరు జిల్లాకు కొత్తగా మంజూరైన రెండవ 58 మండల విద్యాశాఖాధికారుల పోస్టుల నియామకానికి ప్రస్తుతం ఎంఇఒగా పనిచేస్తున్న జెడ్పీ యాజమాన్యం వారు, అలాగే జెడ్పీ యాజమాన్యంలోని హెచ్‌ఎంలు నేడు ఉదయం 9 గంటలకు డిఇఒ కార్యాలయంలో నిర్వహిస్తున్న కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని డిఇఒ పి.శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించిన సీనియారిటీ జాబితాను www.deoblogspot.com వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు.

ఆగష్టు 21 నుండి 25 వరకు కెఎల్‌యులో

మానవ మెదడు పనితీరుపై కార్యశాల

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

మానవ మెదడు సంక్లిష్టమైన అవయవమని, మెదడును అర్థం చేసుకోవడం అంటే మీ సొంత ఆరోగ్యాన్ని అర్థం చేసుకోవడమని కెఎల్ డీమ్డ్ విశ్వవిద్యాలయం ఛైర్మన కోనేరు సత్యన్నారాయణ అన్నారు. శనివారం వైస్ చాన్సలర్ చాంబర్ లో సైన్స్ అండ్ టెక్నాలజీ మాజీ సలహాదారు డాక్టర్ ఎ.ముఖోపాధ్యాయతో కలిసి పోస్టర్ విడుదల చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ మనిషి ఆరోగ్యకరమైన జీవితానికి ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది మానవ మెదడు మాత్రమే అని అన్నారు. ప్రొఫెసర్ ఛాన్సలర్ డాక్టర్ కెఎస్ జగన్నాథరావు మాట్లాడుతూ వైద్యరంగంలో మానసిక ఆరోగ్యం పెనుసవాల్ గామారిందని ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం రోగ నిర్ధారణ కోసమే కాకుండా చికిత్స కోసం కూడా మెదడు యొక్క రహస్యాలను అర్థం చేసుకోవడానికి మెదడు యొక పరిశోధనకు ఇంటర్ డిసిప్లినరీ విధానం అవసరమన్నారు. ఆగస్టు 21 నుండి 25 వరకు కెఎల్ వర్శిటీలో జరిగే ఈ వర్క్ షాప్ కు వర్శిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.వసుజాదేవి కన్వీనర్ గా వ్యవహరిస్తుండగా ఎస్.ఇ.ఆర్.బి, సైన్స్ మరియు టెక్నాలజీ విభాగం వారి సహకారంతో ఈ కార్యశాలను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యశాలకు అంతర్జాతీయ స్థాయిలో పారిస్ న్యూరో సెంటర్ నుండి డాక్టర్ అనురాధర్ కార్, అమెరికాలోని హెూస్టన్ మెథడిస్ట్ నుండి డాక్టర్ మురళిధర్ హెగ్డే, నిపెర్ డైరెక్టర్ డాక్టర్ శశిబాల, మద్రాస్ ఐఐటి నుండి ప్రొఫెసర్ టిఎస్ రావు, మైసూర్ నిమ్ హాన్స్ నుండి డాక్టర్ అనితా మహదేవన్ ,బృందా న్యూరో ఆసుపత్రి గుంటూరు నుండి ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ భవనం హనుమ శ్రీనివాసరెడ్డి, అపోలో ఆసుపత్రి నుండి డాక్టర్ వినయ్ హెగ్డే , హైదరాబాదు నిపెర్ నుండి డాక్టర్ ధర్మేంధ్ర వంటి ప్రముఖ మానసిక వైద్యులతో పాటు ప్రముఖ న్యూరో శాస్త్రవేత్తలు పాల్గొంటారని తెలిపారు.

విద్యార్థికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-అచ్చంపేట



స్నేహ హస్తాల ఆధ్వర్యంలో అచ్చం పేట గ్రామానికి చెం దిన నందమూడి తరుణ్ అనే విద్యార్థికి రూ. 30 వేల ఆర్థిక సహాయాన్ని స్నేహ హస్తాల ప్రతినిధి మామిళ్ళపల్లి విజయలక్ష్మి శనివారం అంద జేశారు. తరుణ్‌కు హాస్టల్ ఫీజ్ నిమిత్తం రూ.30,000 వేల చెక్కును అంద జేశారు. ఈ సందర్భంగా విజయవాడ లోని ఎచీవర్స్ అకా డమీ లో సిఎ కోర్సు చేస్తున్న తరుణ్ మాట్లాడుతూ స్నేహ హస్తాల సంస్థ అనేక మంది విద్యార్థులకు ఉన్నత చదువు నిమిత్తం సహకారం అందింస్తోందని, తన చదువు పూర్తయిన తర్వాత స్నేహ హస్తాలతో కలిసి పనిచేయాలనుకుంటున్నట్లు చెప్పాడు. కార్యక్రమంలో, తుమ్మా. శౌరెడ్డి, స్నేహహస్తాలు కో-ఆర్డినేటర్ తాయి కరిముల్లా బాబు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం

ప్రజాశక్తి-దాచేపల్లి : దాచేపల్లి మండలంలోని మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య బదిలీపై వెళుతున్న సందర్భంగా ఆమెను శనివారం సన్మా నించారు. మున్సిపల్ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ సాం బయ్య ఆమెను దుశ్శాలువాతో సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ అభివృద్ధి నిమి త్తం ఆమె చేసిన సేవలను కొనియాడారు. కార్య క్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఖాదర్ మస్తాన్, మండల కన్వీనర్ కోటా కృష్ణ పాల్గొన్నారు.



విద్యుత్ ఛార్జీల పెంపునకు నిరసన

తెలుగు యువత ఆధ్వర్యంలో సంతకాల సేకరణ




ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి : విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా జిల్లా తెలుగు యువత ఆధ్వర్యంలో స్థానిక ఎన్‌టిఆర్ స్టేడియం వద్ద శనివారం సంతకాల సేకరణ చేపట్టారు. విద్యుత్ చార్జీలతో వివిధ రూపాల్లో చార్జీలు పేరుతో ఇష్టానుసారంగా కరెంటు బిల్లులు వేయటాన్ని వ్యతిరేకిస్తూ అధ్యక్షులు రావిపాటి సాయి కష్ణ ఆధ్వర్యంలో గుంటూరులోని ఎన్టీఆర్ స్టేడియం వద్ద కందుల రోడ్ లోని రైతు బజార్ వద్ద అడ్డు అదుపులేని కరెంటు చార్జీలను తగ్గిన చాలని సూచిస్తూ రూపొందించిన క్లాత్ బ్యానర్ల పైన ప్రజలతో సంతకాల సేకరణ నిర్వహించారు. జిల్లా తెలుగు యువత అధ్యక్షులు రావిపాటి సాయి కష్ణ మాట్లాడుతూ 45 డిగ్రీల వడగాల్పులతో కూడిన ఎండల్లో సగటు రాష్ట్ర పౌరుడు ఫ్యాన్ వేసుకోవాలంటే బయపడి వేసుకోలేని దీనస్థితిలో ఉన్నారని అధికారంలో కి వచ్చాక 8 సార్లు కరెంటు బిల్లులు పెంచారని ఆగ్రహం వ్యక్తం చేసారు. రాష్ట్ర తెలుగుయువత ఉపాధ్యక్షులు షేక్ ఫిరోజ్, జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి దామచర్ల శ్రీనివాస్ రావు, రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ లాల్ వజీర్, రాష్ట్ర బిసి సెల్ ఉపాధ్యక్షులు మారం కిశోర్, రాష్ట్ర టిడిపి కార్యదర్శి పంచుమర్తి శేషు, జిల్లా తెలుగుయువత ఉపాధ్యక్షులు గుత్తికొండ కిరణ్ యాదవ్, అధికార ప్రతినిది షేక్ షకూర్, ప్రచార కార్యదర్శి చెరుకుపల్లి నాగరాజు, కార్యనిర్వాహక కార్యదర్శి మన్నెం శ్రీనివాస్ రావు, కార్యదర్శి మాచవరపు దాసు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష' పకడ్బందీగా నిర్వహించాలి

ప్రజాశక్తి-గుంటూరు

జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అనుబందంగా ఈ నెల 23 నుండి జులై 23 వరకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతుందని, జిఎంసి అధికారులు, సచివాలయ కార్యదర్శులు అధిక ప్రాధాన్యతగా ఈ కారక్రమంలో పాల్గొనాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం స్థానిక శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో అదనపు కమిషనర్ పెద్ది రోజా జిఎంసి విభాగాధిపతులు, సూపరింటెండెంట్లు, వార్డు సచివాలయ కార్యదర్శులు, నోడల్ అధికారులకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహణ, విధివిదానాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు మిగిలిపోయిన అర్హులు, సమస్యలను గుర్తించేందుకు ప్రతి ఇంటినీ సందర్శించేలా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం నెలరోజుల పాటు చేపట్టనున్నదని, ప్రతి గడపకు వాలంటీర్లు, సచివాలయ కార్యదర్శులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు వెళ్ళేలా కార్యాచరణ రూపొందించారన్నారు. ఈ కార్యక్రమంలో



మాట్లాడుతున్న నగర అడిషనల్ కమిషనర్ రోజా

ప్రభుత్వ పథకాలు, వివిధ సర్టిఫికెట్స్‌పై ప్రజల అభిప్రాయాలు తెలుసుకొని, అర్హులుగా గుర్తించిన వారికి ఆగస్ట్ 1 నుండి లబ్ది చేకురేలా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. గతంలో పరిష్కారం కాని వినతులను కూడా మరొక పర్యాయం పరిశీలించి, నిర్దేశిత గడువులోగా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, ఎస్.ఈ. భాస్కర్, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, పిఓ. రవీంద్ర, సిఎంఓహెచ్ డాక్టర్ విజయలక్ష్మి, ఎంహెచ్ఓ డాక్టర్ భానుప్రకాష్, మేనేజర్ శివన్నారాయణ, వార్డు సచివాలయ విభాగ సూపరిండెంట్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పాతగుంటూరుపోలీసు స్టేషన్ తనిఖీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి : పాత గుంటూరు పోలీసు స్టేషన్‌ను ఎస్‌పి ఆరీఫ్ హఫీజ్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులకు పలు పలు సూచనలు చేశారు. పాత గుంటూరు పోలీస్ స్టేషన్‌లో నమోదు అయిన కేసుల్లో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న వాటిపై దృష్టి సారించాలని ఎస్‌పి కోరారు. పెండింగ్ కేసులపై దష్టి సారించి, మరియు ఇతర ముఖ్యమైన కేసు ఫైల్స్ ను విశ్లేషించి త్వరితగతిన పెండింగ్ కేసుల దర్యాప్తు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఎఎస్‌పి నచికెత్ షిల్‌కే స్పెషల్ బ్రాంచ్ డి ఎస్ పి సుభాష్ , పాత గుంటూరు సి ఐ సుబ్బారావు, సి ఐ నరసింహ రావు పాల్గొన్నారు.

23 నుండి జగనన్న సురక్ష పథకం ప్రారంభం

ప్రజాశక్తి-దుగ్గిరాల

ప్రతి పథకం ప్రతి ఇంటికి చేరడమే జగనన్న సురక్ష పథకం లక్ష్యమని అధికారులు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం అధికారులు వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ సేవలు అందుకోలేని వారి కోసం అధికారులను వాళ్ళ దగ్గరికి పంపించి ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలకు సంబంధించిన సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. మూడు రోజుల ముందే వాలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి ఫ్రీ క్యాంపులు నిర్వహిస్తారన్నారు. సిఎస్‌డబ్ల్యూ ఎస్ సర్వీసులు గుర్తించి ప్రతి పథకం ప్రతి ఇంటికి చేరేటట్లు చూస్తామన్నారు. ప్రతి సచివాలయం అధికారుల బృందం నెల రోజుల్లో మూడుసార్లు పర్యటన చేస్తుందని, తహశీల్దార్, ఇఒపిఆర్‌డితో ఒకటీం, ఎంపీడీవో డిప్యూటీ తహశీల్దార్‌తో మరో టీం మొత్తం రెండు టీంలు పనిచేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో తాసిల్దార్ కే మల్లేశ్వరి, ఎంపీడీవో కుసుమ, శ్రీదేవి, ఈఓపిఆర్ డి శ్రీనివాసరావు డిప్యూటీ తాసిల్దార్ రాకేష్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్

జూన్ 23 నుంచి జగనన్న సురక్షా పథకం ప్రారంబించనున్నట్లు తెనాలి తహశీల్దార్ కె రవిబాబు తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అధికారులుతో సమావేశమయ్యారు. కార్యక్రమానికి తెనాలి మండలాధికారి విజయాలక్ష్మణ్ అధ్యక్షత వహించారు. తహసీల్దార్ రవిబాబు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో జూన్ 23 నుంచి ప్రవేశపెట్టనున్న జగనన్న సురక్షా పథకాన్ని ఇంటింటా తిరిగి వివరించాలని సచీవలయా సిబ్బందికి వివరించారు. మున్సిపల్, రూరల్ పరిధిలో అధికారులు రెండు విభాగాలుగా విడిపోయి సచీవాలయ సిబ్బందికి తోడ్పాటు అందించాలన్నారు. ఈ క్రమంలో ప్రజా సంక్షేమ పథకాలు ప్రజలకు వి వివరిస్తూ, చేరువ అవ్వలేనటువంటి పథకాలలో ఆధార్, రేషన్, వివాహ, ఆదాయ, కుల ధ్రువీకరణ, జనన, మరణ ధ్రువపత్రాలలో మార్పు, చేర్పులను సరిచేసి పథకాలు చేరువకు కృషిచేయాలన్నారు. ఇంటివద్దే సమస్యలను పరిష్కరించాలన్నారు. జగనన్న సురక్షా పథకం పర్యటనపై ఆయా పట్టణ గ్రామ ప్రజలకు ముందస్తు సమాచారం అందించాలని, సూచించారు. సచివలయా సిబ్బందితో పాటు వార్డు వాలంటీర్లు, గహసారదులు పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి చెన్నుబోయిన శ్రీనివాసరావు, డిటి హేనాప్రియ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం పై పొన్నూరు పట్టణంలోని మున్సిపల్ కళ్యాణ మండపంలో వార్డు సచివాలయాల సిబ్బందికి అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో మున్సిపల్ ప్రత్యేక అధికారి వెంకటరమణ,సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు

ప్రజాశక్తి - మేడికొండూరు

ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలు అందించాలనే సంకల్పంతో, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష పథకాన్ని అమలు చేయడంలో అధికారులు ముఖ్య భూమిక పోషించాలని మండల ప్రత్యేక అధికారి వీరాచారి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న సురక్ష పథకం పై మండల స్థాయి అధికారులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి వీరాచారి మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటివరకు అమలు చేస్తున్న పలు రకాల సంక్షేమ పథకాలు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఇంటింటికి తిరిగి గుర్తించి వారికి అందించేందుకు అధికారులు సన్నద్ధం కావాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కే ప్రభాకర్ రావు, తాసిల్దార్ జి కరుణ కుమార్, పిఓపిఆర్డిపీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారం

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం పలు రకాల అభివృద్ధి పథకాలు చేపట్టిందని విద్యార్థులు వాటిని సద్వినియోగపరుచుకోవాలని పెదనందిపాడు ఎంపీపీ టి హెప్సీబా అన్నారు. శనివారం స్థానిక జడ్పీ పాఠశాలలో హెచ్‌ఎం లక్ష్మీ దుర్గ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జగనన్న ఆణిముత్యాలు పంపిణీ కార్యక్రమంలో ఎంపీపీ పాల్గొన్నారు. అనంతరం పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని కే లక్ష్మికి రూ.3వేలు, ద్వితీయ స్థానంలో జె శ్యాంబాబు, టి కుమార్‌బాబులకు రూ.2వేలు చొప్పున నగదు, మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దాసరి పద్మారావు, మండల విద్యాశాఖ అధికారి బాలసుబ్రమణ్యం, జడ్పిటిసి అన్నపూర్ణ ఉప ఎంపీపీ ఖాసీంబి, డి రాంబాబు పాల్గొన్నారు.



నేడు ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి- పెదనందిపాడు రూరల్

స్థానిక పిఎఎస్ కళాశాలలో ఆదివారం నాట్స్ అధ్యక్షులు నూతి బాపయ్య చౌదరి (బాపు) ఉచిత మెగా కంటి వైద్య చికిత్స శిబిరం నిర్వహిస్తున్నారు. పర్చూరు, చిలకలూరిపేట, పెదనందిపాడు, కాకుమాను, పత్తిపాడు, బాపట్ల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బాపు మిత్రమండలి అధ్యక్ష కార్యదర్శులు కాకుమాను నాగేశ్వరరావు, దాసరి సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

చెక్‌పోస్టు ఉద్యోగి దుర్మరణం


మృతుడు ఎస్‌కె బాషా

ప్రజాశక్తి - చేబ్రోలు

వరి ధాన్యపు లోడుతో వెళ్తున్న లారీని చెక్‌పోస్టు వద్ద ఆపేందుకు ప్రయత్నించిన ఉద్యోగిని ఢీకొట్టగా అక్కడికక్కడే మృతి చెందిన ఘటన శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. చేబ్రోలు మండలం నారాకోడూరు చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న ఎస్‌కె బాషా (42) డ్యూటీలో ఉండగా చేబ్రోలు నుంచి గుంటూరు వైపు వెళుతున్న ధాన్యం లారీ వేగంగా వెళ్తుంది. దీనిని ఆపి తనిఖీ చేసేందుకు భాష లారీని ఆపాడు. అయితే లారీని డ్రైవర్ ఆపలేదు. దీంతో భాషా లారీని ఆపేందుకు ప్రయత్నించాడు. వేగంగా ముందుకు పరిగెత్తాడు. అయితేలారీ తగిలి కిందపడి మృతి చెందాడు. భాషా బంధువు నాగూర్ వలి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కె. ఆనంద్ దర్యాప్తు చేస్తున్నారు. లారీ లో రవాణా చేయుచున్న ధాన్యానికి సంబంధించి చెక్ పోస్టులో చెల్లించవలసిన పన్నును చెల్లించకుండా తప్పించుకొనేందుకు డ్రైవర్ చేసిన నిర్లక్ష్యమైన ఆలోచనే ప్రమాదానికి కారణమని అధికారులు తెలిపారు.ధాన్యపు లారీ ఎపి04వై1783 చేబ్రోలు పోలీసు స్టేషన్ తరలి తీసుకురావడం జరిగిందని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చేబ్రోలు ఎసై కె.ఆనంద్ తెలిపారు.


మృతి చెందిన బాలుడు దాసరి తరుణ్

ఆటో ప్రమాదంలో విద్యార్థి మృతి

ప్రజాశక్తి-దుగ్గిరాల

ప్రమాదవశాత్తు ఆటో నుండి క్రింద జారిపడి ఐదో తరగతి విద్యార్థి చనిపోయిన సంఘటన మండలంలోని కంఠంరాజు కొండూరు గ్రామంలో జరిగినది. సేకరించిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన దాసరి రాజు తన కుమారుడు భార్యతో కలిసి పొలం వెళ్లి వస్తుండగా ఆటో కుదుపులకు కుమారుడు భార్య కింద పడిపోయారు వెనక టైరు కుమారుడిపై ఎక్కినది దీనితో కుమారుడు దాస రి తరుణ్ (11) అక్కడికక్కడే మరణించాడు, భార్యకు స్వల్ప గాయాలయ్యాయి.

అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-దుగ్గిరాల

మండల కేంద్రం దుగ్గిరాలలో శుక్రవారం రాత్రి అనుమానాస్పద మతి జరిగింది .తెనాలి చిన్న రావూరు పార్కుకు చెందిన నత్తల రాజశేఖర్ ఒంగోలు ఐటిఐ కాలేజీలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఇతనికి దుగ్గిరాలకు చెందిన యువతితో ఎనిమిది సంవత్సరాల క్రితం పరిచయం ఏర్పడింది. దీనితో తరచుగా ఆమె ఇంటికి వచ్చి ఆమెతో సహజీవనం గడుపుతున్నాడు .శుక్రవారం రాత్రి ఆమె ఇంట్లో ఉరి వేసుకున్నాడని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు అప్పటికే అతను మతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. అతని సోదరుడు నత్తల రాజశేఖర్ స్థానిక పోలీస్ స్టేషన్లో శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు దుగ్గిరాల ఎస్సై ఏ శ్రీనివాసరెడ్డి మతదేహానికి పోస్టుమార్టం చేయించి అనుమానాస్పద మతిగా కేసు నమోదు చేశారు. మతుడికి సంవత్సరం క్రితం తెనాలికి చెందిన యువతితో వివాహమైనట్లు తెలిసింది.

గొట్టిపాడు పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పత్తిపాడు మండలం గొట్టిపాడు గ్రామ పంచాయతీలో నిధులు దుర్వినియోగం కేసులో పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం రాజశేఖర్ బాపట్ల మండలం నరసాయపాలెం కార్యదర్శిగా పనిచేస్తున్నారు. రూ.20 లక్షలు నిధులు దుర్వినియోగం అయినట్టు ప్రాథమిక విచారణలో తేలడంతో ఈచర్య తీసుకున్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-తెనాలి

రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు ఎస్ఐ సిహెచ్ వెంకటేశ్వర్లు శనివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. జాబితాలో ఉన్న రౌడీషీటర్లను స్టేషన్‌కు పిలిపించారు. ఈ సందర్భంగా వారితో ఎస్ఐ మాట్లాడుతూ రౌడీషీటర్లపై పోలీస్ నిఘా నిత్యం ఉంటుందన్నారు. ఎలాంటి అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. రౌడీషీటర్లపై ఎలాంటి పిర్యాదులొచ్చినా ఉపేక్షించేది లేదన్నారు. కౌన్సిలింగ్‌లో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



హోటల్లో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి-తాడేపల్లి

ఉండవల్లి సెంటర్‌లోని అయ్యప్పస్వామి గుడి వద్ద ఓ హోటల్‌లో శనివారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. దీంతో హోటల్ పని చేసే వారితో పాటు జనం భయాందోళనతో పరుగులు తీశారు. ప్రాణాపాయం ఏమీ జరగకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. సిలిండర్ లీకై మంటలు ఎగిసి పడ్డాయని స్థానికులు చెబుతున్నారు. ఎగిసిపడుతున్న మంటలను చూసి భయపడకుండా అంజాద్ అనే యువకుడు మంటలను ఆర్పేశాడు. ఈ సందర్భంగా పలువురు అతన్ని అభినందించారు. అగ్నిప్రమాదం జరిగిందని తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి వచ్చే సరికి మంటల తీవ్రత తగ్గడంతో వారి పని సులువైంది. ఈ సందర్భంగా అగ్నిమాపక అధికారులు మాట్లాడుతూ ఎండల తీవ్రత దృష్ట్యా రోడ్డు పక్కన చిరువ్యాపారులు నిర్వహించే వారు గ్యాస్ సిలిండర్ల వాడకంపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు



ప్రజాశక్తి- పెదకూరపాడు

బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిం చిన వారి మీద కేసు నమోదు చేసి కోర్టుకు పంపినట్లు పెదకూరపాడు ఎస్ఐ వెంకటరావు అన్నారు. శనివారం దీనిపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్లు తెలిపారు. పెదకూరపాడు మండలం,గ్రామం లో ఎవరైనా బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించినట్లయితే వారి మీద కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవి స్తుంటే పోలీస్ స్టేషన్‌లో తెలపాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



ప్రజాశక్తి-నకరికల్లు

ద్విచక్ర వాహనదారున్ని తప్పించబోయి ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టడంతో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాలు ప్రకారం తెలంగాణ రాష్ట్రం సిద్ధిపేట జిల్లా నుంచి ఐదుగురు వ్యక్తులు కారులో బాపట్ల బీచ్ కు వెళుతుండగా నకరికల్లు భారత్ పెట్రోల్ బంక్ వద్ద ద్విచక్ర వాహనం తప్పించబోయి ఆగి ఉన్న లారీ ని ఢీకొట్టడంతో ఎర్ర బాబు సాయికుమార్ తీవ్ర గాయాలు కాగా నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. 108 లో వీరిని నరసరావుపేట ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. బాబురి. వేణుగోపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో గేదే మృతి

ట్రావెల్స్ బస్సు ఢీ కొనడంతో ఘటన

ప్రజాశక్తి- నూజెండ్ల

గేదెలు రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన కావేరి ట్రావెల్స్ బస్సు ఢీ కొట్టడంతో చూడు గేదె అక్కడికక్కడే మతి చెందిన ఘటన మండలంలోని అయినవోలు గ్రామంలో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం ఉదయం 7 గంటల సమయంలో పొలం వెళ్లేందుకు గేదెలు రోడ్డు దాటుతుండగా బెంగళూరు నుండి వినుకొండ వైపు వస్తున్న కావేరి ట్రావెల్స్ బస్సు వేగంగా వచ్చి ఓ గేదెను ఢీ కొట్టింది. బస్సు ముందు భాగం గేదెను ఢీ కొనడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మతి చెందింది. గేదె 9 నెలల చూడు తో ఉంది. గేద సుమారు రు.90 వేల రూపాయల ఖర్చు చేస్తుంది. బాధితుని ఫిర్యాదు మేరకు ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. గేదెకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్.. దెబ్బతిన్న ఇల్లు

ప్రజాశక్తి-నరసరావుపేట

రొంపిచర్ల మండలంలోని సంతగుడిపాడు గ్రామంలో శనివారం అగ్ని ప్రమాదం జరిగింది. ఆ గ్రామంలో ఎస్. టి కాలనీలో నివాసం ఉంటున్న గాధంశెట్టి రాములమ్మ ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో రాములమ్మ ఇల్లు పాక్షికంగా దెబ్బతింది. ఇంట్లో విలువైన వస్తువులు, సామాన్లు అగ్నికి ఆహుతి అయ్యాయి. స్థానికుల వెంటనే స్పందించి మంటలను ఆర్పివేయటంతో పెద్ద ప్రమాదం తప్పిపోయింది.



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేస్తున్న డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ శోభారాణి

వైద్య ఆరోగ్య సిబ్బంది స్థానికంగా ఉండాలి

ప్రజాశక్తి-రెంటచింతల

వైద్య ఆరోగ్య సిబ్బంది స్థానికంగా ఉంటూ రోగులకు మెరుగైన సేవలు అందించాలని పల్నాడు జిల్లా డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ శోభారాణి ఆదేశించారు. శనివారం మండల కేంద్రమైన రెంటచింతలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రోజుకు ఓపీ ఎంత ఉంటుంది, మందుల సరఫరా సక్రమంగా జరుగు తుంది లేదా ఆసుపత్రిలో చేపట్టిన మరమ్మతులు పూర్తయ్యా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాల్వాయిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పరిశీలించారు. త్వరలో గోలి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నూతన డాక్టర్లు వస్తారని పేర్కొన్నారు ఆమెవెంట ఎంపీపీ దాసరి చౌడేశ్వరి వైస్ ప్రెసిడెంట్ శౌరెడ్డి, డాక్టర్ కృష్ణారెడ్డి,డాక్టర్ హేమ, సిబ్బంది పాల్గొన్నారు.



డిఇఒకు వినతి పత్రం ఇస్తున్న పల్నాడు జిల్లా యుటిఎఫ్ నాయకులు, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు తదితరులు


ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోండి

ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

డిఇఒకు యుటిఎఫ్ నాయకులు వినతి

ప్రజాశక్తి - నరసరావుపేట

ఉపాధ్యాయ బదిలీలు పూర్తయిన అనంతరం పల్నాడు జిల్లాలో వెల్దుర్తి, మాచర్ల, దుర్గి, తదితర మండలాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుల ఖాళీలు, సబ్జెక్టు టీచర్లకు ఖాళీలు ఏర్పడ్డాయని వీటిని వెంటనే విద్యా సంవత్సరం ప్రారంభంలోనే భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణ్ రావు డిఇఒ కె.శామ్యూల్‌ను కోరారు. ఏళ్ల తరబడి ఈ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉందని తక్షణమే ప్రమోషన్ల ద్వారా ఖాళీలను భర్తీ చేయాల్సిన ఆవశ్యకతను అవసరాన్ని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి దృష్టికి, రాష్ట్ర విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకువెళతామని కె.ఎస్ తెలిపారు. ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఖాళీలు డిఇఒకు తెలియజేశారు. ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఖాళీలు కూడా ఉండటం సరికాదని పాఠశాల నిర్వహణపై ప్రభావం చూపుతుందన్నారు. ఉపాధ్యాయులు కూడా మారుమూల మండలాల్లో పనిచేయటానికి సిద్ధపడితేనే అక్కడి పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పల్నాడు జిల్లాలోని పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను డిఈఓ దృష్టికి తీసుకువచ్చారు. బదిలీల సందర్భంగా ఉత్పన్నమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు. డిఇఒను కలిసిన వారిలో యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షులు పి ప్రేమకుమార్, ప్రనధాన కార్యదర్శి జి విజయసారధి, నాయకులు ఎం. మోహనరావు, బాగేశ్వరిదేవి, టి.వెంకటేశ్వర్లు, ఎన్ సుందర్రావు, కె. రవిచంద్రశేఖర్, వై శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



జగనన్న ఆణిముత్యాలుకు హాజరైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధికారులు, విద్యార్థికి బహుమతి ప్రదానం చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు, కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే గోపిరెడ్డి తదితరులు

నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి-నరసరావుపేట

కార్పొరేట్ స్థాయి పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్ది పేదవాని పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశమని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు రాంబాబు అన్నారు. శనివారం స్థానిక నరసరావుపేట లోని భువనచంద్ర టౌన్ హాలులో విద్యాశాఖ ఆధ్వర్యంలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం(డిస్ట్రిక్ట్ బ్రిలియన్స్ అవార్డు-2023) లో పాల్గొని ప్రసంగించారు. తొలుత కార్యక్రమాన్ని వందేమాతరం గీతాలపన, మెరిట్ జాబితా లోని తొలి 5 మంది విద్యార్థులతో జ్యోతి ప్రజ్వలన చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు జిల్లా విద్యా శాఖ అధికారి శామ్యూల్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ పాఠశాలలు శిథిలావస్థలో ఉండేవని, రాష్ట్ర ప్రభుత్వం మా బడి నేడు-నేడు కింద పాఠశాలల రూపురేఖలు మార్పులు తీసుకొచ్చిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలలో ఒకప్పుడు అలసత్వం ఉండేదని ఇప్పుడు దానికి తావు లేదన్నారు. ఒక కుటుంబంలో ఒక తరం విద్యావంతులైతే ఆ పరంపర అలాగే కొనసాగుతుందని అన్నారు. ఉన్నత చదువులు చదవడం ద్వారా విదేశాలకు వెళ్ళడం సాధ్యపడుతుందని అన్నారు. రానున్న రోజులలో అక్షరాస్యత 10 శాతానికి చేరుకుంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పేదవానికి మెరుగైన విద్య,వైద్యాన్ని అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నదని తెలిపారు.జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించేందుకు జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా తన పాఠశాల రోజులను కలెక్టర్ గుర్తు చేసుకున్నారు. విజయనగరం జిల్లా ధర్మవరం ప్రభుత్వ పాఠశాలలో తాను చదువుకున్న సమయంలో టాపర్‌గా నిలిచానని చెప్పారు. లక్ష్యం ఎప్పుడూ ఉన్నతంగా ఉండాలని, లక్ష్యసాధనలో అలసత్వం ఉండకూడదని అన్నారు. పాజిటివ్ థింకింగ్ చాలా ముఖ్యమని , పొగడ్తలకు పొంగిపోకుండా రానున్న రోజులలో మరింత ఏకాగ్రతతో చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు.

శాసనమండలి సభ్యులు కల్పలతా రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం శుభ పరిణామం అన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు విద్యారంగంలో రూ.60 వేల కోట్ల వరకు ఖర్చు చేయడం జరిగందన్నారు. ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంపై రూ 60 వేల కోట్ల ఖర్చు చేసినట్లు చెప్పారు. రానున్న రోజులలో ప్రభుత్వ పాఠశాలలో 600/600 మార్కులు లక్ష్యంగా నిర్దేశించుకుని పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి స్కూల్ లో 15 నిమిషాల పాటు విద్యార్థులతో స్కూల్ ప్రారంబ సమయంలో లేదా మరెప్పుడైనా ఆ రోజు న్యూస్ చదివించడం, ఒక అంశం పై మాట్లేడే విధంగా చర్యలు తీసుకోనేలా చూడడం జరుగుతుందని తద్వారా విద్యార్థులలో స్టేజి ఫియర్ ఉండదని అన్నారు. ఆగస్టు-15 న క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం 10 వ తరగతిలో అత్యధిక మార్కులు పొందిన 25 మందికి, ఇంటర్ లోఅత్యధిక మార్కులు పొందిన 15 మందికి నగదు బహుమతి, మెడల్ మరియు ప్రశంసా పత్రాన్ని అందిచారు. జిల్లా లో మొదటి బహుమతి కింద రూ 50 వేలు, గోల్డ్ మెడల్, రెండవ బహుమతి కింద రూ 30 వేలు మరియు సిల్వర్ మెడల్, తతీయ బహుమతి కింద రూ 10 వేలు, బ్రాంజ్ మెడల్ ప్రశంసా పత్రాలు అందచేసారు. ఈ కార్యక్రమంలో నగరపాల కమిషనర్ రాం మోహన్, జిల్లా ఒకేషనల్ విద్యాశాఖాధికారి లీలావతి, ఉప విద్యాశాఖాదికారి వేణుగోపాల్, స్వామి మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రం రొంపిచర్ల జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో గత విద్యాసంవత్సరంలో ఎస్.ఎస్.సి లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు కింద నగదు ప్రోత్సాహక బహుమతులు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో ప్రధానోపాధ్యాయులు బిఎం సుబానీ మాట్లా డారు. అనంతరం పదవతరగతిలో ప్రథమ స్థానం సాధించిన రెబ్బా శ్రీనిధి సుష్మ, ద్వితీయ స్థానం సాధించిన పిడెం ప్రత్యూష, తృతీయ స్థానం సాధించిన గుంజి స్రవంతి లకు నగదు ప్రోత్సాహక బహుమతులు, మెడల్స్, ప్రశంసాపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ టి.రామిరెడి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-చిలకలూరిపేట

శ్రీ మద్ది కామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పసుమర్రు లో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా పదో తరగతి పరీక్ష ఫలితాలలో పాఠశాల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించినట్లు వై. హనుమంతరావు చెప్పారు. పదో తరగతి ఫలితాలలో 574/600మార్కులు సాధించిన తన్నీరు హిమబిందు, 569 మార్కులు సాధించిన పెట్లూరి రూపాంజలి, 515 మార్కులు సాధించిన షేక్ కరిముల్లాకు మెడల్, మెరిట్ సర్టిఫికెట్,నగదు ను బహుమతిగా ఇచ్చి సత్కరించారు. విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో 15వ వార్డు కౌన్సిలర్ జాలాది సుబ్బారావు , 16వ వార్డు కౌన్సిలర్ షేక్ మస్తాన్ వలి, పాఠశాల తల్లి దండ్రుల కమిటీ చైర్మన్ ఎర్రం వెంకటసుబ్బయ, పాఠశాల పూర్వ విద్యార్థి సంఘ నాయకులు గద్దె హరి బాబు, ఉపాధ్యాయులు ఎన్.శంకరరావు, జి అనసూయ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కారెంపూడి

మండల కేంద్రమైన కారెంపూడి లోని స్థానిక బి ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల (బాలురు)లో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వనపాల్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన మూఢవాతు అశోక్ నాయక్,ఎం వి ఎస్ చంద్ర శేఖర్ చారి,కూచూపుడి కిషోర్ లకు మెడల్స్ తో పాటు ప్రోత్సాహక నగదు వరుసగా రూ.3 వేలు,రూ.2 వేలు, వెయ్యి రూపాయలు అందజేశారు. విద్యార్థుల తల్లి దండ్రులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వేముల పద్మ లింగయ్య, వైస్ ప్రిన్సిపాల్ ఎస్ కే ఇబ్రహీం,జెఎల్ వీ హేమ భూషణ్,పిడి విజయ శేఖర్ వార్డెన్ నాగేశ్వరరావు, పాల్గొన్నారు .

గురువులు, తల్లిదండ్రుల మాటలు వినండి



గురువులు, తల్లిదండ్రులు, మన శ్రేయస్సు కోరుకునే వారి మాటలు వినాలని నక్కరాజు గార్లపాడు జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 10 తర గతిలో టాపర్ (590/ 600) శివ మాధవ్ రెడ్డి అన్నాడు. గురుభక్తి చాలా ముఖ్యమని చెప్పాడు. ఈ సందర్భంగా ఏకలవ్యుని ఉద హరించాడు. పాఠ్య పుస్తకాలనే చదవాలని తోటి విద్యార్థులకు సూచించాడు.

కష్ట పడితేనే ఫలితం



విద్య అనేది నిరంతర ప్రక్రియ అని బాగా కష్ట పడితేనే ఫలితం వస్తుందని మోర్జం పాడు, జిల్లా పరిషత్ పాఠశాల కు చెందిన పదో తరగతి టాపర్ నవ్యశ్రీ (588/600) చెప్పింది. విద్య అనేది సమాజంలో మార్పు తీసు కొస్తుందని, లక్ష్యం దిశగా చదవాలని సూచించారు. ప్రణాళికాబద్దంగా, టైం ప్రకారం చదవాల్సిన అవసరం ఉందని చెప్పింది. అన్ని సబ్జెక్టులకు, పాఠ్యాంశాలకు సమ ప్రాధాన్యతను ఇచ్చి చదవాలని సూచించింది.



శ్రీ మద్ది కామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పసుమర్రులో..



కారెంపూడిలోని బి ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల లో..



రొంపిచర్ల జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో ..

ప్రజాశక్తి
గుంటూరు
5
ఆదివారం 18 జూన్ 2023

టిడ్కో గృహ సముదాయాల్లో నీటికి కటకట

పట్టించుకోని అధికారులు

నానా ఇబ్బందులు పడుతున్న టిడ్కో గృహ నివాసితులు



ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి పట్టణంలో టిడ్కో గృహ సముదాయములో ఉంటున్న నివాసితులు నీటికి కటకట లాడుతున్నారు. కార్పొరేషన్ అధికారులకు, స్థానిక ఎమ్మెల్యేకు అనేక పర్యాయములు విన్నవించుకున్నప్పటికీ నీటి సమస్య పరిష్కారం కావడం లేదని గృహ సముదాయంలో నివాసితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో 1728 ఇళ్లను నిర్మించడం జరిగింది. జగన్ ప్రభుత్వంలో మిగిలిపోయిన మౌళిక వసతులను కల్పించి గత సంవత్సరం డిసెంబర్ నెలాఖరులో లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించారు. 1728 గృహాల్లో నివాసం ఉంటున్నారు. అప్పటినుండి మిగిలిపోయిన మౌళిక సదుపాయాలు ఏర్పాటు చేశారు. నీటి సమస్య మాత్రం నెలలో పది రోజులు పాటు తీవ్రంగా ఎదుర్కొంటున్నారు. నాలుగు అంతస్తుల మేరకు నిర్మాణాలు చేయడం జరిగింది. అధికార యంత్రాంగం మాత్రం ఒకసారి మోటర్లు పాడైపోయాయని, మరమ్మతులు చేస్తున్నామని సమాధానం చెబుతున్నారు. మరొకసారి కరెంట్ బిల్లు చెల్లించలేకపోవడం వలన సమస్య ఏర్పడిందని చెబుతున్నారు. అయితే సమస్యను పూర్తిగా పరిష్కరించడానికి మాత్రం చర్యలు చేపట్టడం లేదని గృహాల్లో ఉంటున్న కుటుంబాల వారు వాపోతున్నారు. నీళ్లు రాని రోజుల్లో కార్పొరేషన్ అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. అదేవిధంగా నారా లోకేష్ సహకారంతో కూడా ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. అపార్ట్‌మెంట్‌లో క్రింద ఉన్న నివాస కుటుంబాల వారికి ఆ సమయంలో బాగానే ఉంటుంది కానీ, మూడు, నాలుగు అంతస్తులో ఉండేవారు క్రింద నుండి మెట్లపై నీళ్లను తీసుకురావాలంటే ఎంతో ఇబ్బందిగా ఉంటుందని వాపోతున్నారు. నీటి కోసం పనులను మానుకొని ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, పనులు మానుకుంటే కుటుంబాలు ఎలా గడుస్తాయో తెలియని పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు. ఇళ్లు నిర్మించి ఇచ్చారే గాని నీళ్లు లేకపోతే ఎలా బతకాలని అంటున్నారు. అనేక పర్యాయములు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి దృష్టికి, కార్పొరేషన్ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినప్పటికీ పరిష్కారం కావడం లేదని వాపోతున్నారు. ఇలా నీటి సమస్య నిత్యం ఉంటే జీవనం సాగించడం చాలా కష్టంగా ఉంటుందని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు, స్థానిక ఎమ్మెల్యే తమ సమస్య పరిష్కారానికి కృషి చేయాలని టిడ్కో గృహాల్లో నివాసం ఉంటున్న ప్రజలు కోరుకుంటున్నారు.



విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తు జయప్రద తదితదరులు

ఉన్నతమైన స్థానం విద్యతోనే సాధ్యం

పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు

ప్రజాశక్తి - మేడికొండూరు : ప్రతి విద్యార్థికి ఉన్నతమైన సముచిత స్థానము విద్యతోనే సాధ్యమని మేడికొండూరు జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కే జయప్రద అన్నారు. పది ఫలితాల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రభుత్వము నగదు బహుమతి ప్రకటించింది. అందులో భాగంగా జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం శనివారం మేడికొండూరు జిల్లా పరిషత్ హై స్కూల్‌లో జరిగింది. పదో తరగతి పరీక్ష ఫలితాలలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. ప్రధమస్థానం సాధించిన ఎన్ భాను ప్రకాష్ (577)కు రూ. 3వేలు, ద్వితీయ ఎస్ నిఖిల్ (573) కు రూ. 2వేలు, తృతీయ ఎస్ మహేష్ (559)కు రూ.వెయ్యి అందజేశారు.

జాతీయ స్థాయిలో కెఎల్‌యు రైఫిల్ షూటింగ్‌లో

కెఎల్‌యు విద్యార్థికి నాలుగు పతకాలు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్



ఈ నెల4 నుండి 16 వరకు త్రివేండ్రం లో జరిగిన జాతీయ కెఎస్ఎస్ఎం జాతీయ రైఫిల్ షుటింగ్ లో కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలో సిఎస్ఐటి ద్వితీయ సంవత్సరం చదువుతున్న మద్దినేని ఉమామహేష్ అనే విద్యార్థి సీనియర్ విభాగంలో 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ షూటింగ్‌లో బంగారు పతకం సాధించాడు. దీంతో పాటు యూత్ మిక్స్‌డ్‌లో మరో బంగారు పతకంతో పాటు రెండు రజతాలను సాధించి జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్‌ను నాలుగవ స్థానంలో నిలిపి రికార్డు సృష్టించాడు. దీంతో రాష్ట్రంలోని రైఫిల్ షూటింగ్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కెఎల్ యు లోని క్రీడా విభాగం అసోసియేట్ డీన్ డాక్టర్ కె.హరికిషోర్ మాట్లాడుతూ తమ విశ్వవిద్యాలయంలో క్రీడలకు పెద్దపీట వేస్తున్నామన్నారు. ఇటీవల కాలంలో జరిగిన కౌన్సిలింగ్ లో కూడా క్రీడల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన వారికి రాయితీలు కూడా ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారదివర్మ, ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు, క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ హరికిషోర్, వ్యాయామ అధ్యాపకులు మద్దినేని ఉమామహేష్ ను అభినందించారు.

పురపాలికల్లో ప్రీ ఆడిట్‌పై అవగాహన ముఖ్యం

-రాష్ట్ర ఆడిట్ సంచాలకులు హరిప్రకాష్

ప్రజాశక్తి-తెనాలి

పురపాలక సంఘాల్లో ప్రవేశపెట్టనున్న ప్రీ ఆడిట్‌పై అధికారులందరికీ అవగాహన ముఖ్యమని రాష్ట్ర ఆడిట్ శాఖ సంచాలకులు ఆర్ హరిప్రకాష్ అన్నారు. పురపాలక సంఘం కౌన్సిల్ మాల్లో శనివారం బాపట్ల, గుంటూరు జిల్లాల పరిదిలోని తెనాలి, బాపట్ల, పొన్నూరు, చీరాల, రేపల్లె, అద్దంకి పురపాలక సంఘ అధికారులకు ప్రీ ఆడిట్‌పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న హరిప్రసాద్ ప్రీ ఆడిట్ ఆవశ్యకత, దాని విది విధానాలను వివరించారు. ఏఏ అంశాలపై ఆడిట్‌లో ఉదహరించాలన్న అంశాలను తెలియజేశారు. ప్రీఆడిట్‌పై సిబ్బందికి పూర్తిస్థాయి అవగాహన కోసం కార్యక్రమం నిర్వహించినట్లు హరిప్రకాష్ చెప్పారు. కార్యక్రమంలో ఆడిట్ శాఖ రాష్ట్ర ఉపసంచాలకులు నాగశ్రీనివాసరావు, తాడేపల్లి- మంగళగికి మున్సిపల్ ఎగ్జామినర్ అశోక్ మౌర్య, గుంటూరు, బాపట్ల జిల్లాల ఆడిట్ అధికారులు బి.ధనలక్ష్మి, కె.పద్మజ, మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంత రావు, గుంటూరు, బాపట్ల జిల్లాల ఆడిట్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హరిప్రసాద్

ఫ్యాషన్ ప్లస్ 100 సిసి బైక్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-తెనాలి:

ద్విచక్రవాహన చోదకులు అభిరుచులకు అనుగుణంగా, అత్యాధునిక సాంకేతి పరిజ్ఞానంతో రూపొందించిన హీరో ఫ్యాషన్ ప్లస్ స్టైలిష్ ఫర్ ఎవర్ 100 సిసి బైక్ ఆవిష్కరణ స్థానిక సాయిదివ్య మోటార్స్‌లో శనివారం జరిగింది. ఆర్టీవో ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని వాహనాన్ని ఆవిష్కరించారు. షోరూమ్ మేనేజర్ ఎన్.శ్రీనివాసరావు హీరో వాహనశ్రేణికి తరగని ఆదరణ ఉందని, దానికనుగుణంగా వచ్చిన హీరో ఫ్యాషన్ ప్లస్ స్టైలిష్ ఫర్ఎవర్ 100 సిసి బైక్‌కు కూడా వినియోగదారుల నుంచి మంచి ఆదరణ లభిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెకటర్ టి.రాఘవరావు, ఏఎంవిఐ మధుసూధనరావు, మోటారు మెకానిక్ అసోసియేషన్ అద్యక్షులు కరిముల్లా, షోరూమ్ సిబ్బంది పాల్గొన్నారు.



బైక్ ఆవిష్కరణలో ఆర్టీవో ప్రసాద్, షోరూమ్ సిబ్బంది



ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్న నాట్స్ అధ్యక్షులు బాపయ్య చౌదరి

కళాశాల విద్యార్థులకు ఉపకార వేతనాలు

ప్రజాశక్తి-పెదనందిపాడు రూరల్

పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించి ఉపకార వేతనాలకు ఎంపికైన విద్యార్థుల ను మిగతా విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకొని కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని నాట్స్ అధ్యక్షులు నూతి బాపయ్య చౌదరి (బాపు) అన్నారు. శనివారం పెదనందిపాడు పిఎఎస్ కళాశాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థు లు వై జాహ్నవి, డి నవ్య, జి అఖిల, డి శ్రీ సాయి, షేక్ అమీర్‌లకు తనతో పాటు, దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ఉపకారవేతనాలను ఒక్కొక్కరికి రూ. 10వేల చొప్పున అందజేశారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు నర్రా బాలకృష్ణ, ప్రిన్సిపల్ వీర రాఘవయ్య, దాతలు దాసరి రమేషు, నూతి సుబ్బారావు, తుమ్మల నాగేశ్వరమ్మ, ఎన్‌సిసి అధికారి డాక్టర్ పాతూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-తాడేపల్లి :పెంచిన విద్యుత్ ఛార్జీలు, అదనపు భారాలను రద్దు చేయాలని, స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా సోమవారం తాడేపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ట్రూఅప్ ఛార్జీల పేరుతో దొంగచాటుగా భారాలు మోపుతున్న ప్రభుత్వ వైఖరిని ప్రజలు నిరసించాలని కోరారు. విద్యుత్ వినియోగదారులు ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కొండెక్కిన కోడి @ కిలో రూ.350

ప్రజాశక్తి-తాడేపల్లి



కోడి మాంసం ధర ఒక్కసారిగా కొండెక్కింది. మార్కెట్లో కిలో ధర ప్రస్తుతం రూ.350 ఉంది. దీంతో మాంసప్రియులు విలవిల్లాడిపోతున్నారు. ముక్కలేనిదే ముద్ద దిగని మాంసాహారులు పెరిగిన కోడి ధరలను చూసి వామ్మో అనే పరిస్థితి ఏర్పడింది. కోడి మాంసం పెరుగుదలకు ఎండలే ముఖ్య కారణంగా కోళ్ల ఫారం యజమానులు చెబుతున్నారు. గత పది సంవత్సరాల కాలంలో ఎప్పుడూ కనీవినీ ఎరుగని రీతిలో వడగాల్పులతో పాటు ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో కోళ్ల ఫారాల్లో కోళ్లు చనిపోతున్నా యని వ్యాపారులు చెబుతున్నారు. మరోపక్క కోళ్లు తొందరగా పెరగడానికి వివిధ రకాల మందులు వాడుతున్నారని మాంసప్రియులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీని వల్ల 60 రోజులకు తయారవ్వాల్సిన కోడి ఇంజక్షన్ల వల్ల 30 రోజులకే ఎదుగుదల కనబడుతుందని దీని వల్ల కూడా కోడి మాంసం ప్రస్తుతం ఎండాకాలంలో తినడం శ్రేష్టం కాదని డాక్టర్లు చెబుతున్నారు. నిన్నటి వరకు రూ.4 ఉన్న కోడిగుడ్డు ధర రూ.5.40కు చేరుకుంది. అటు కోడిమాంసం ఇటు కోడిగుడ్డు ధర మధ్యతరగతి ప్రజలకు అందే పరిస్థితి లేకుండా పోయింది.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు డిఎస్‌పి దిశా నిర్దేశం

ప్రజాశక్తి-తెనాలి:

ట్రాఫిక్ క్రమబద్దీకరణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని డిఎస్పీ బి.జనార్ధనరావు సిబ్బందిని ఆదేశించారు. తెనాలి డిఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన తరువాత తొలిసారిగా ఆయన ట్రాఫిక్ సమస్యలపై దృష్టి సారించారు. ప్రధాన కూడళ్ళలో శనివారం ఆయన ట్రాఫిక్‌ను పరిశీలించారు. పట్టణ ఒన్‌టౌన,టూటౌన్, త్రీటౌన్, ట్రాఫిక్ సిబ్బంది ద్వారా ట్రాఫిక్ పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడా ప్రజలకు అసౌకర్యం కలుగకుండా చూడాలని, ట్రాఫిక్ క్రమబద్దీకరణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి దిశానిర్ధేశం చేశారు. ఆయన వెంట సిఐలు కె.చంద్రశేఖరరావు, ఎస్.వెంకట్రావ్, బి.రమేష్‌బాబు, ట్రాఫిక్ ఎస్ఐ జె.శ్రీనివాసరావు, ఆయా స్టేషన్ల సిబ్బంది ఉన్నారు.



మార్కెట్ ప్రాంతంలో ట్రాఫిక్‌ను పరిశీలిస్తున్న డిఎస్పీ



ప్లాట్‌ఫామ్ రిక్షాలు అందజేత

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని నులకపేటకు చెందిన ఎస్.కాశిరెడ్డి, ముగ్గురోడ్డుకు చెందిన పి.రాజు, సీతానగరంకు చెందిన కె.సాంబయ్యలకు వైసిపి నాయకులు ప్లాట్‌ఫామ్ రిక్షాలు అందజేశారు. ముగ్గురూ తమకు ప్లాట్‌ఫామ్ రిక్షాలు కావాలని అర్జీలు అందజేయడంతో స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి స్పందించి క్రిష్టియన్‌పేటలో రిక్షాలు శనివారం అందజేశారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు బి.వేణుగోపాల సోమిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.డేవిడ్‌రాజు, ఎం.వెంకటరామిరెడ్డి, ఎం.వెంకటేశ్వరరావు, సిహెచ్.దుర్గారావు, ఎం.ప్రకాష్, టి.మహేష్‌రెడ్డి, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

80 శాతం రాయితీతో పశువుల బీమా

ప్రజాశక్తి-పెదకూరపాడు

ఎనభై శాతం రాయితీతో పశువుల బీమా చేస్తున్నట్లు పెదకూరపాడు వెటర్నరీ ఏ డి కొమ్మినేని సారథి అన్నారు .శనివారం ఆయన మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ, బీపీఎల్ కింద వారికి 80 శాతం రాయితీ, 20 శాతం మాత్రమే లబ్ధిదారుడు వాటా ఉంటుందన్నారు. ఒక గేద ఖరీదు 30000 రూపాయలు అనుకుంటే మూడు సంవత్సరాల గాను కేవలం 384 రూపాయలు మాత్రమే చెల్లించవలసి ఉంటుందన్నారు. తెల్ల రేషన్ కార్డు లేని వారైతే 960 రూపాయలు చెల్లించాలన్నారు. గొర్రె లేదా మేకలకు కూడా ఇన్సూరెన్స్ చేస్తున్నామన్నారు. ఒక్కొక్క గొర్రె ఖరీదు 6000 రూపాయలు అనుకుంటే బిపిఎల్ ఎస్సీ ఎస్టీ వారికి సంవత్సరానికి 36 రూపాయలు మాత్రమే ఉంటుందన్నారు. అవకాశాన్ని పశువుల యజమానులు గొర్రెల యజమానులు వినియోగించుకోవాలని కోరారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

ప్రజాశక్తి-నాదెండ్ల

నాదెండ్ల మండలం, మల్లయ్యపాలెం,మైనంపాడు గ్రామలలోని పార్టీ సీనియర్ మహిళా నాయకులు ఎం. శాంతమ్మ, షేక్ మీరాబి ఇటీవల మరణించారు. "ప్రత్తిపాటి ఫౌండేషన్" ద్వారా ఎం. శాంతమ్మ కుటుంబ సభ్యులకు రూ.20,000 వేలు, అలాగే షేక్ మీరాబి కుటుంబ సభ్యులకు కూడా మరో ఇరవై వేల రూపాయలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాదెండ్ల మండల అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, 1వ క్లస్టర్ ఇంచార్జి మల్లవరపు జయ ప్రసాద్, గ్రామ పార్టీ అధ్యక్షులు అంతయ్య, పార్టీ సీనియర్ నాయకులు రాఘవయ్య, సింగయ్య, మరియదాసు, ఖాజా షేక్, అజిత పాల్గొన్నారు.



నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-మాచర్ల

మద్యం సేవించి వాహనాలు నడపవద్దని అతివేగంగా నడిపినా,సంబంధిత పత్రాలు లేకపోయినా కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ బాలకష్ణ అన్నారు. స్థానిక రింగ్ రోడ్ సెంటర్లో శనివారం వాహన తనిఖీలు నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్ లేకపోయినా అతివేగంగా నడిపిన నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఏ వాహనం పైన అయినా కేసు నమోదు చేస్తామని వాహనదారులు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. శనివారం పల్వాహనాలపై కేసు నమోదు చేసే అపరాధ రుసుం విధించారు. తనికిలలో ఎస్సై సౌందర్య రాజన్ ,సిబ్బంది పాల్గొన్నారు.

డిప్యూటీ తహసిల్దార్ గా రాజశేఖర్ నాయక్

ప్రజాశక్తి-వెల్దుర్తి



వెల్దుర్తి మండలం డిప్యూటీ తాసిల్దారుగా రాజశేఖర్ నాయక్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా రాజశేఖర్ నాయక్ శనివారం పల్నాడు, బాపట్ల, ప్రకా శం జిల్లాల వై.యస్. ఆర్.సి.పి యువజన విభాగం జోనల్ ఇంచార్జి, వై.యస్.ఆర్.సి.పి రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. పిన్నెల్లి వెంకటరామిరెడ్డి రాజశేఖర్ నాయక్ కు శుభాకాంక్షలు తెలియజేశారు.

'జగనన్న సురక్ష'పై అవగాహన

ప్రజాశక్తి-ఫిరంగిపురం



జగనన్న సురక్ష పథకం గురించి ఫిరంగిపురం మండల పరిషత్ కార్యాలయం నందు మండల సచివాలయ సిబ్బందికి మండల ప్రత్యేక అధికారి యుగంధర్ కుమార్ ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యుగంధర్ కుమార్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను సంతప్తి స్థాయిలో పరిష్కరించడం, అర్హులందరికీ పథకాలను అందించడమే లక్ష్యంగా ఈ నెల 23 నుంచి జులై 23వ తేదీ వరకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో సచివాలయాల సిబ్బంది, వాలంటీర్లు, గహ సారథులు ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న సురక్ష కార్యక్రమం గురించి వివరించాలన్నారు.

సమస్యలున్న వారిని సచివాలయాల వద్దకు తీసుకు వచ్చి వారికి కావాల్సిన సర్టిఫికెట్లు, డాక్యుమెంట్లు అన్నీ అందించనున్నట్లు చెప్పారు. ప్రతి ఇంటినీ సందర్శించి ఆ ఇంటికి సంబంధించి జనన, మరణ , కుల, వివాహ ధృవపత్రాలు నుంచి ప్రభుత్వ పథకాలను పొందడం దాకా ఏమైనా సమస్యలున్నాయా అని నిశితంగా పరిశీలించి , ఆ వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. అర్హులుగా గుర్తించిన వారిని సచివాలయాల వద్దకు ఆహ్వానించి వారికి అవసరమైన సర్టిఫికెట్లు, డాక్యుమెంట్లు అదే రోజు అందజేయాలన్నారు. ప్రతి రోజు ప్రక్రియను గ్రామ, వార్డు సచివాలయాల పోర్టల్లో అప్లోడ్ చేయాలన్నారు. జగనన్న సురక్ష ద్వారా అర్హులుగా గుర్తించిన వారికి ఆగష్టు 1వ తేదీన ప్రభుత్వం లబ్ది చేకూర్చుతుందని అన్నారు కార్యక్రమంలో జెడ్పిటిసి సభ్యురాలు దాసరి కత్తి రేణమ్మ, ఎంపీడీవో డి అనురాధ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా కానుక కిట్ల పంపిణీ

ప్రజాశక్తి-బెల్లంకొండ



కిట్లను పంపిణీ చేస్తున్న బెల్లంకొండ జడ్పిటిసి వెంకటరెడ్డి

బెల్లంకొండ మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జగనన్న విద్య కిట్లను బెల్లంకొండ జెడ్ పి టి సి గాదె వెంకటరెడ్డి పం పిణీ చేశారు. కార్యక్రమంలో బెల్లంకొండ మండల వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గడ్డి పర్తి చినబాబు రావు, సచివాలయం కన్వీనర్ పాకాల పాటి షేక్ మౌలాలి, షేక్ రెహ్మాన్గా, గాదే నర్సిరెడ్డి, సులేమాన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.శాంతి,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి- నూజెండ్ల

మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కంభంపాడులో జగనన్న విద్యా కానుక నాలుగో విడత పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. విద్యారినీవిద్యార్థులకు విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. రవికుమార్ , పిఎంసి చైర్మన్ ఎన్. సతీష్, జడ్పిటిసి సుబ్బులు రామయ్య, ఎంపిటిసి రాజేష్, గ్రామ పెద్దలు లింగారావు, తిరుమల శెట్టి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఆర్ జె రమేష్, సూర్యప్రకాష్, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వినుకొండ శాశ్వత తాగునీటి పథకానికి తూట్లు: టిడిపి

- రూ.32 కోట్లు కమిషన్ అడిగిన ఎమ్మెల్యే బొల్లా
- పైపు లైన్ దశలో నిలిపివేసిన కాంట్రాక్టర్లు
- జిల్లా టిడిపి అధ్యక్షులు జివి ఆంజనేయులు

ప్రజాశక్తి-వినుకొండ

టిడిపి హయాంలో తీసుకువచ్చిన 159 కోట్లు వినుకొండ పట్టణ శాశ్వత త్రాగునీటి పథకానికి పాలకులు తూట్లు పొడిచి పట్టణ ప్రజలను మోసం చేస్తున్నారని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు అన్నారు. పట్టణంలో కలుషిత నీటి సరఫరా నిలిపి ఎన్ఎస్పి కెనాల్ నుండి సిద్ధమైన తాగునీరు సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం జీ.వీ ఆంజనేయులు ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున మోటార్ సైకిల్ పై నిరసన ర్యాలీ చేపట్టారు. పట్టణానికి తాగునీరు సరఫరా చేసే సింగర చెరువును సందర్శించారు. చెరువులో తగ్గిన నీటిమట్టాన్ని పరిశీలించారు. అర్ధాంతరంగా నిలిచిపోయిన పైప్లైన్ నిర్మాణం పనులను పరిశీలించారు. అనంతరం గాయత్రీ నగర్లో పనులు నిలిచిపోయి పైపులు, నిలువ చేసిన పైప్లైన్ సామాగ్రిని సందర్శించారు. ఈ సందర్భంగా జివి ఆంజనేయులు మాట్లాడుతూ వినుకొండ పట్టణ పుర ప్రజలు ప్రశాబ్దాలుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు చంద్రబాబు నాయుడు సహకారంతో నాడు మునిసిపల్ పట్టణ అభివద్ధి శాఖ మంత్రి వెంకయ్య నాయుడు దష్టికి తీసుకువెళ్లి 159 కోట్లు నిధులు మంజూరు చేయించి టెండర్లు కూడా పిలవడం జరిగింది అన్నారు. ఎన్నికల కోడ్ అడ్డరోడ్డంతో పనులు నిలిచిపోగా నాలుగేళ్ల వైసిపి పాలనలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు శాశ్వతంగా త్రాగునీటి పథకం చేపట్టకుండా కమిషన్ల కక్కుర్తి కాంట్రాక్టర్ను రూ.32 కోట్లు అడగడంతో వారి వెనక్కి వెళ్లారని ఆరోపించారు. సంవత్సర కాలంలో శాశ్వత మంచినీటి పథకాన్ని పూర్తి చేయాల్సిన పాలకులు వారి స్వార్ధానిపై చెరువు కట్టలను కేవలం రూ.20 లక్షలతో వెడల్పు చేసి మునిసిపల్ సాధారణ నిధులు, ఆర్థిక సంఘం నిధుల ద్వారా నామినేషన్ వర్కుల పద్ధతిలో 65



సింగర చెరువును పరిశీలిస్తున్న జివి ఆంజనేయులు

లక్షలు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు దోచుకున్నాడని ఆరోపించారు. త్రాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించకుండా మోసం చేస్తున్నారని అన్నారు. ప్రస్తుతం వినుకొండ పట్టణంలో కలుషిత నీరు సరఫరా చేస్తున్నారని, కుల్లి పోయిన కూరగాయలు, చికెన్ వేస్ట్ గా ఉన్న దొండపాడు చేపల చెరువు నుండి కలుషిత నీరు సరఫరా చేస్తున్నారని అన్నారు. టిడిపి హయాంలో తెచ్చిన రూ.159 కోట్ల శాశ్వత త్రాగునీటి పథకాన్ని చేపట్టి కలుషిత త్రాగునీటి సరఫరా నిలిపివేసి ఎన్ఎస్పి కెనాల్ నుండి శుద్ధమైన త్రాగునీటి సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పఠాన్ ఆయుబ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ బి ఐ మేనేజర్ గా కె.వి పున్నారావు

ప్రజాశక్తి - రెంటచింతల

మండల కేంద్రమైన రెంటచింతలలోనే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ గా కె.వి పున్నారావు శనివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆయన కర్నూలు జిల్లా ఆత్మకూరు నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన సురేష్ హైదరాబాదుకు బదిలీ అయ్యారు.



అమర్నాథ్ కుటుంబానికి న్యాయం చేయండి

ప్రజాశక్తి-వినుకొండ

బాపట్ల జిల్లా చెరుకు పల్లి మండలం రాజోలు ఉప్పల వారి పాలెంలో బాలుడు ఉప్పాల అమర్నాథ్ను అగ్రవర్ణ కులస్థుడు తన అనుచరులతో కలిసి చిత్రహింసలు పెట్టి, పెట్రోల్ పోసి నిప్పంటించిటన ఘటనను నియోజకవర్గ బీసీ సంక్షేమ సంగం అధ్యక్షుడు డాక్టర్ పాశం నాగమల్లేశ్వరరావు ఖండించారు. వెంకటేశ్వరరెడ్డిని, అతని అనుచరులను శిక్షించాలని, అమర్నాథ్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు నిరసన ప్రదర్శన చేశారు. నిరసనలో ప్రదర్శనలో జిల్లా అధికార ప్రతినిధి కంచర్ల రామాంజనేయులు, నియోజకవర్గ వైస్ ప్రెసిడెంట్ గుంజి కాళింగరాజు మీడియా కోర్దినేటర్ కంచర్ల వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి వెంకటాచారి, బీసీ నాయకులు పాలుగోని పాల్గొన్నారు.

'రాష్ట్రంలో అరాచకాలపై సీఎం చోద్యం'

ప్రజాశక్తి-చిలకలూరిపేట

వైసిసిప్రభుత్వంలో అత్యాచారాలు, హత్యలు నిత్యకత్యమయ్యాయని మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు ఆరోపించారు. స్థానిక2వ లై న్ పండరిపురంలో ఆయన నివాసంలో విలేఖరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో నాలుగేళ్లుగా అరాచక పాలన సాగుతోందని.. ప్రజాస్వామ్యం బదులు అరాచక స్వామ్యం నడుస్తోందని ప్రత్తిపాటి తెలిపారు. పొద్దున్నే కత్తిపోట్లు, మధ్యాహ్నం మర్డర్లు, సాయంత్రం సజీవదహనాలతో రాష్ట్రం పరిఢవిల్లుతోందని ప్రత్తిపాటి ఎద్దేవా చేశారు. బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం ఉప్పలవారిపాలెంలో పదో తరగతి బాలుడి హత్య అత్యంత బాధాకరమన్నారు. సోదరిని వేధిస్తున్నారని ప్రశ్నించిన బాలుడిని పెట్రోల్ పోసి తగులబెట్టడం అత్యంత దారుణమని అన్నారు. రాష్ట్రంలో ఇన్ని ఘటనలు జరుగుతుంటే.. క్రైమ్ తగ్గిందని డీజీపీ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. బాలుడి కుటుంబానికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రజాశక్తి-బెల్లంకొండ

వైకాపా ప్రభుత్వంలో అత్యాచారాలు, హత్యలు నిత్యకృత్యమయ్యాయని టిడిపి నాయకుడు తెలుగుదేశం పార్టీ పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధికార పతినిధి వెన్నా వెంకటరెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో నాలుగేళ్లుగా అరాచక పాలన సాగుతోందని, ప్రజాస్వామ్యం బదులు అరాచక పాలన నడుస్తోందని రాష్ట్రాన్ని డ్రగ్స్, గంజాయికి అడ్డాగా మార్చారని దుయ్యబట్టారు. పొద్దున్నే కత్తిపోట్లు, మధ్యాహ్నం మర్డర్లు, సాయంత్రం సజీవదహనాలతో రాష్ట్రం పరిఢవిల్లుతోందని వెన్నా ఎద్దేవా చేశారు. బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం ఉప్పలవారిపాలెంలో పదో తరగతి బాలుడి హత్య అత్యంత బాధాకరమని అన్నారు. బాలుడి కుటుంబానికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని వెన్నా అన్నారు. పోలీస్ వ్యవస్థను వైసిపి వ్యవస్థగా వాడుకుంటున్నారని దుయ్యబట్టారు.

ప్రతిభను ప్రోత్సహించేందుకే 'ఆణిముత్యాలు'

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్. జగన్ మోహన్ రెడ్డి విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, జగనన్న ఆణిముత్యాలు క్రింద అందిస్తున్న నగదు పురస్కారాలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక కొండా వెంకటప్పయ్య కాలనీలోని కేఎస్ఆర్టీ మున్సిపల్ హైస్కూల్లో జరిగిన జగనన్న ఆణిముత్యాలు జిల్లా స్థాయి బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ పార్వతి , జెడ్పీ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా , ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌రావు, రాష్ట్ర గ్రంధాలయ పరిషత్ ఛైర్మన్ మందపాటి శేషగిరి రావు, మేయర్ కావటి శివనాగ మనోహర నాయుడు, కుమ్మరి, శాలివాహన కార్పొరేషన్ ఛైర్మన్ మండేపూడి పురుషోత్తం, సోషల్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్ గనిక ఝాన్సీ, తాడికొండ నియోజవర్గ ఇన్ చార్జ్ కత్తెర సురేశ్ కుమార్, డిఈఓ శైలజ, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ విజయలక్ష్మి పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలలో పదో తరగతి చదివి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు పారితోషికాలు, మెమోంటోలు, పతకాలు అందించి గౌరవించడం వల్ల విద్యార్థులను మరింతగా ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. జెడ్పీ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించేందుకు పాఠశాల స్థాయిలో, నియోజకవర్గ స్థాయిలో, జిల్లా స్థాయిలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం ఎంతో ప్రోత్సాహకంగా వుంటుందన్నారు. అనంతరం జగనన్న ఆణిముత్యాలు జిల్లా స్థాయి బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమం జరిగింది. జిల్లా స్థాయిలో పదవ తరగతిలో ప్రధమ బహుమతి పొందిన నలుగురు విద్యార్థులకు రూ. 50 వేలు, ద్వితీయ బహుమతికి పొందిన ఆరుగురికి రూ.30 వేలు, తృతీయ బహుమతి పొందిన ఆరుగురుకి రూ.15 వేలు, ఇంటర్ విద్యార్థులకు మొదటి బహుమతి 7 గురికి మొత్తం 23 మందికి రూ.8.20 లక్షల మెగా చెక్కును అందజేశారు. విద్యార్థులు, తల్లిదండ్రుల్ని ఈ సందర్భంగా సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఈఓ వేంకటేశ్వరరావు, జిఎంసి డిప్యూటీ కమిషనర్ వెంకట కృష్ణయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాంబాబు, ఉర్దూ డిఐ ఖాసిం, కార్పొరేటర్ గురవయ్య తదితరులు పాల్గొన్నారు.



మెగా చెక్కును అందచేస్తున్న కలెక్టర్ తదితరులు

సిఆర్‌డిఏ పరిధిలో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

సీఆర్డీఏ పరిధిలోని పేదలందరికీ ఇళ్ల పథకం లేఅవుట్‌లలో ఇళ్ళ నిర్మాణాలు ప్రారంభించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను లేఅవుట్ ప్రత్యేక అధికారులు, సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో ప్రణాళిక ప్రకారం సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, జెసి రాజకుమారితో కలసి సీఆర్డీఏ పరిధిలోని పేదలందరికీ ఇళ్ళ పథకం లేఅవుట్‌లలో ఇళ్ళ నిర్మాణాలపై లేఅవుట్ ప్రత్యేక అధికారులు, గహనిర్మాణ శాఖ, రెవెన్యూ, మున్సిపల్, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఆర్డీఏ పరిధిలోని పేదలందరికీ ఇళ్ళ పథకం లేఅవుట్‌లలో జూలై 8వ తేదీన ఇళ్ళ నిర్మాణాలను ప్రారంభించేందుకు, లబ్ధిదారులకు సర్వేకోడ్, ఆప్షన్ 3 ఇళ్ళకు సంబంధించి కాంట్రాక్టర్లతో ఎంవోయులు, బ్యాంక్ అకౌంట్‌లు ప్రారంభించటం, జీయో ట్యాగింగ్ ప్రక్రియలను నిర్దేశించిన తేదీ నాటికి ఖచ్చితంగా పూర్తి చేయాలన్నారు. లే అవుట్‌లో ఇంటిస్థలాలు కేటాయించిన పెదకాకాని, తుళ్లూరు, మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని లబ్ధిదారుల సర్వేకోడ్ జనరేట్‌కు వివరాలు సేకరణ జూన్ 19 నాటికి పూర్తి చేయాలని, జూన్ 23 నాటికి వివరాలను ఆన్లైన్‌లో నమోదు చేసి సర్వేకోడ్ జనరేట్ చేయాలన్నారు. లే అవుట్‌లలో ఇళ్ళ నిర్మాణాలకు అవసరమైన విద్యుత్ ఏర్పాట్లు, నీటి సౌకర్యం కల్పించటానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి పనులు ప్రారంభించేందుకు సీపీడీసీఎల్, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటశివరామిరెడ్డి, డిప్యూటీ కలెక్టర్లు మోవిడి వాణి, సాయిశ్రీ, హౌసింగ్ పీడీ వేణుగోపాలరావు, లే అవుట్ ప్రత్యేక అధికారులు ఎంటీఎంసీ కమిషనర్ శారదా దేవి, డీఆర్డీఏ పీడీ హరిహరనాద్, డీసీఎల్ అనురాధ, భూగర్భజలవనరుల శాఖ డీడీ వందనం, మెప్మా పీడీ వెంకట నారాయణ, ఆర్డీఓ ప్రభాకర్ రెడ్డి, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ ఈఈ శ్యాంసుందరు, సీపీడీసీఎల్ ఈఈ తులసీరాం, తహశీల్దార్లు రాం ప్రసాదు, ఫణీంద్రబాబు, రత్నం, నాగిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

రక్తదాన శిబిరంలో పాల్గొనండి

ప్రజాశక్తి-తాడేపల్లి

సిఐటియు ఆధ్వర్యంలో పాత గుంటూరు బిఆర్ స్టేడియం వద్ద గల సిఐటియు కార్యాలయంలో ఆదివారం జరగనున్న రక్తదాన శిబిరంలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియ పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు కోరారు. తాడేపల్లి నుంచి రక్తదానం చేసే యువకులతో గుంటూరు బయల్దేరుతున్నట్లు ఆయన ప్రకటించారు.



శ్రీశ్రీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నిర్వాహకులు

సాహితీరంగంలో శ్రీశ్రీ ప్రస్థానం చెరగనిది

ప్రజాశక్తి-తెనాలి

పట్టణానికి చెందిన శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో శనివారం అభ్యుదయ కవి శ్రీరంగం శ్రీనివాసరావు వర్ధంతి సభ నిర్వహించారు. స్థానిక ఐతానగర్ డాంగేవారి వీధిలోని కళావేదిక కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో తొలుత శ్రీశ్రీ చిత్రపటానికి నివాళులర్పించారు. కళావేదిక జిల్లా కమిటి అధ్యక్షులు రంగిశెట్టి రమేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు బొల్లిముంత కృష్ణ పాల్గొని మాట్లాడుతూ శ్రీశ్రీ సాహిత్యం అజరామరమన్నారు. సాహితీ ప్రపంచ ంలో ఆయన ప్రస్థానం చెరగనిదన్నారు కార్యక్రమంలో కళావేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు పెద్దీటి యోహాను, కవులు ఆళ్ళ నాగేశ్వరరావు, వి.భీమేశ్వరప్రసాద్, అస్మతున్నీసాభేగం, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత ఎంవి రఘునాధరావు పాల్గొన్నారు.



అనుబంధ ఆచార్యులుగా పారిశ్రామిక వేత్తలు

వర్సిటీలో పారిశ్రామిక, ఆచార్యుల ముఖాముఖి సమావేశం

ప్రజాశక్తి - ఎఎన్‌యు

సమాజ అభివృద్ధిలో ఆచార్యుల, మరియు పారిశ్రామికవేత్తల పాత్ర కీలకమని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య పి.రాజశేఖర్ వ్యాఖ్యానించారు. యువతను భావి భారత నిర్మాణ కర్తలుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఆచార్యులు, పారిశ్రామికవేత్తలపై ఉందని తెలిపారు. శనివారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన పారిశ్రామిక వేత్తల, విశ్వవిద్యాలయ ఆచార్యుల ముఖాముఖి సమావేశం లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విసి మాట్లాడుతూ నాగార్జున విశ్వ విద్యాలయం జాతీయ, అంతర్జాతీయ ప్రాముఖ్యత కలిగిన విశ్వవిద్యాలయం అన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పరిశ్రమల నిర్వహణకు అవసరమైన అంశాలను ప్రణాళికలను బోధన అంశాలను తన పాఠ్యాంశాలుగా రూపొందించి ఉత్తమ విద్యను భావి ప్రపంచానికి అందిస్తోందని తెలిపారు. యూనివర్సిటీ స్థాపన దశ నుండీ పారిశ్రామికవేత్తలను , పారిశ్రామిక పరిపాలన దక్షిత కలిగిన, శాస్త్రవేత్తలను, వివిధ రంగాలలో నిపుణులైన వ్యక్తులను, మేనేజ్మెంట్ నిపుణులను సిలబస్ ని తయారు చేసే బోర్డ్ ఆఫ్ స్టడీస్ లో సభ్యులుగా నియమిస్తూ వస్తున్నదని గుర్తుచేశారు. విద్యార్థులు తమ విద్యాభ్యాసం అయిన వెంటనే మంచి ఉద్యోగ ఉపాధి అవకాశాలను పొందుతున్నారని తెలియజేశారు. ప్రపంచ దేశాలలో విశ్వవిద్యాలయాలు అనుసరిస్తున్న నూతన విద్యా విధానాలు మానవ వనరుల సద్వినియోగం పై దృష్టి సారించి అందుకు తగినట్లుగా విశ్వవిద్యాలయం సాగుతోందని తెలిపారు. భవిష్యత్తు లో విద్యార్థుల ఉద్యోగ నైపుణ్యాలను పెంపొందించేందుకు వివిధ రంగాలలో నిష్ణాతులైన పలువురు పారిశ్రామిక వేత్తలను విశ్వవిద్యాలయంలో ఆయా విభాగాలలో అనుబంధ ఆచార్యులుగా సేవలు అందించనున్నట్లు తెలిపారు. విద్యా బోధనలో 30శాతం విశిష్ట వ్యక్తులతో చెప్పించేలా ఏర్పాటు చేస్తామని తెలిపాలరు. సిఐఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రెసిడెంట్ ఎమ్. లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ మానవ మేధస్సును పరిపూర్ణంగా సద్వినియోగం చేసుకోవాలని అప్పుడే సంపూర్ణమైన అభివృద్ధి సాధ్యమని విద్యార్థులు ఈ విషయాన్ని గ్రహించాలని సూచించారు. కార్యక్రమంలో రెక్టార్ పి వరప్రసాద్ మూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, ఐటిసి గుంటూరు శాఖకు చెందిన వైస్ ప్రెసిడెంట్ హెచ్ ఆర్ పి వీరాస్వామి, ఎఫ్టో నిక్స్ మేనేజింగ్ డైరెక్టర్ డి. రామకృష్ణ, ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి పలువురు పారిశ్రామిక వ్యాపారవేత్తలు హాజరయ్యి పలు సూచనలు చేశారు. పూర్వ విద్యార్థుల సంఘ సంచాలకులు ఆచార్య డా జి.వి. ఎస్ .ఆర్ ఆంజనేయులు ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు.



వంతెన నిర్మాణానికి ఎంపి నిధులు రూ.45 లక్షలు

ప్రజాశక్తి-దుగ్గిరాల

మండలంలోని చిలువూరు గ్రామం నుండి దళిత వాడికి వెళ్లే వంతెన నిర్మాణానికి రాజ్యసభ సభ్యులు అయోధ్య రామిరెడ్డి రూ.45 లక్షలు నిధులు కేటాయించినట్లు ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి తెలిపారు. బ్రిడ్జి శిథిలావస్థకు చేరడంతో స్థానికులు మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఆర్‌కె చొరవతో ఎంపీ నిధుల నుండి ఈ కేటాయింపులు జరిగాయి. కాలం చెల్లిన బ్రిడ్జిని తొలగించి అదే ప్రాంతంలో క్రొత్త బ్రిడ్జిని నిర్మిస్తున్నారు. ఎంపీపీ జడ్పిటిసి మేకతోటి అరుణ శనివారం బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.



మాట్లాడుతున్న బిసి సంఘం నాయకులు

నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలి

ప్రజాశక్తి - మంగళగిరి

చెరుకుపల్లి మండలం రాజోలు పంచాయతీ పరిధిలోని ఉప్పలవారి పాలేనికి చెందిన 10వ తరగతి విద్యార్థి ఉప్పల అమర్నాథ్‌పై పెట్రోలు పోసి నిప్పంటించి హత్య చేసిన దోషులను వెంటనే అరెస్టు చేసి కఠినంగాశిక్షించాలని డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం నాయకుల ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్ ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలిపారు. అమర్నాథ్‌పై పెట్రోలు పోసి నిప్పంటించి హత్య చేసిన దోషులను వెంటనే అరెస్టు చేసి కఠినంగాశిక్షించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ బీసీ సేన ఆధ్వర్యంలో శనివారం మంగళగిరి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

శాశ్వత భవనాలు నిర్మించాలి

మంగళగిరి గౌతమబుద్ధ రోడ్ లోని బీసీ పోస్ట్ మెట్రిక్ బాలికల, బాలుర వసతి గృహాలను ఆంధ్రప్రదేశ్ బీసీ సేన నాయకులు సందర్శించారు. హాస్టల్లోని విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను, హాస్టల్లోని సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బీసీ సేన రాష్ట్ర అధ్యక్షులు సొంటి నాగరాజు మాట్లాడుతూ అధునాతన సౌకర్యాలతో శాశ్వత భవనాలు నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు.



కరిముల్లా భౌతికయానికి ఘన నివాళి

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

సీనియర్ జర్నలిస్టు కరిముల్లా భౌతికాయానికి ఏపీయూడబ్ల్యూజే గుంటూరు జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఎస్ ఎన్ మీరా, సురేంద్ర నాథ్, విజయవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నిమ్మరాజు చలపతిరావు, సీనియర్ జర్నలిస్టు కందిమళ్ళ కృష్ణారావు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు ఘనంగా నివాళులర్పించారు.

లాసెట్‌లో సెయింట్ ఆన్స్ విద్యార్థిని సహస్రకు 42వ ర్యాంకు

ప్రజాశక్తి-గుంటూరు

ఎపి లాసెట్ ఫలితాల్లో నగరంలోని సెయింట్ ఆన్స్ బాలికల జూనియర్ కాలేజి విద్యార్థిని గాదె సహస్ర 42వ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కులంధై ట్రీజా మాట్లాడుతూ తమ కళాశాలకు చెందిన విద్యార్థిని 42వ ర్యాంకు సాధించటం గర్వకారణమని పేర్కొన్నారు. సహస్రను ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది పుష్పగుచ్చాలతో అభినందించారు.



విద్యార్థిని సహస్రను అభినందిస్తున్న ప్రిన్సిపాల్



పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ఎస్ఎఫ్ఐ నాయకులు

గ్రంథాలయ సమస్య పరిష్కరించాలి

కలెక్టర్‌కు ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ఎస్ఎఫ్ఐ నాయకులు వినతి

సానుకూలంగా స్పందించిన పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్

ప్రజాశక్తి-నరసరావుపేట

పిడుగురాళ్లలో గ్రంథాలయనిర్మాణం చేయాలని పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్‌కు ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ఎస్ఎఫ్ఐ నాయకులు శుక్రవారం వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతు దాదాపు ఆరు దశాబ్దాల నుండి పిడుగురాళ్ల పట్టణంలో గ్రంథాలయానికి సొంత భవనం లేదని, అద్దెభవనాల్లో, ఇరుకు గదుల్లో కొనసాగుతుందన్నారు. అందువలన కేటాయించిన స్థలంలో భవన నిర్మాణం జరిగేలా కలెక్టర్ చొరవ తీసుకోవాలన్నారు. ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా అధ్యక్షులు కోట సాయికుమార్ మాట్లాడుతు కలెక్టర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. సమస్యను త్వరలోనే పరిష్కరించి గ్రంధాలయ నిర్మాణానికి కృషి చేస్తాన్నారని సాయి కుమార్ తెలిపారు. 1953 నుండి పిడుగురాళ్ల పట్టణంలో గ్రంథాలయం అద్దె భవనంలో కొనసాగుతుందని, ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారన్నారు. మున్సిపల్ కౌన్సిల్‌లో గ్రంథాలయానికి ఆర్టీసీ బస్టాండ్ వెనకాల 10 సెంట్లు శాంక్షన్ చేయడం జరిగిందని, సర్వే నెంబర్ 202లో నిర్మించడానికి తీర్మానించారన్నారు. సదరు గ్రంథాలయం నిర్మించేందుకు జిల్లా గ్రంథాలయం సంస్థ కూడా ఒప్పుకున్నారన్నారు. అయితే ఆర్టీసీ డిపో మేనేజర్ దీనికి అభ్యంతరం తెలియజేస్తున్నారన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని గ్రంథాలయం నిర్మించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయరాజు, ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షురాలు నవిత, అమూల్య తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలకు ఎస్ఎఫ్ఐ వినతి

నిబంధనలు ఉల్లంఘించిన విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్‌కు ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావుతో కలసి ఎస్ఎఫ్ఐ (భారత విద్యార్థి పెడరేషన్) నాయకులు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా అధ్యక్షులు కోట సాయికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి పల్నాడు జిల్లాలో ప్రవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు జీవో నెంబర్ 94.1 సి చట్టాన్ని ఉల్లంఘించి పాఠశాలలో పుస్తకాలు ఎక్కువ రేట్లకు అమ్ముతున్నారని పల్నాడు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. అటువంటి విద్యాసంస్థలపై కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సానుకూలికంగా స్పందించిన పల్నాడు జిల్లా కలెక్టర్ అటువంటి పాఠశాలలపై కఠినమైన చర్యలు తీసుకుంటానని తెలిపారు.



విద్యార్థులతో కలిసి స్టెప్పులు వేస్తున్న హీరో సుధాకర్

వివిఐటిలో నారాయణ అండ్‌కో చిత్రం యూనిట్ సందడి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

నంబూరు వివిఐటి కళాశాలలో లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ ఫేమ్ హీరో, హీరోయిన్‌లు సుధాకర్, పూజా కిరణ్, యామినీ సందడి చేశారు. పాపిశెట్టి ఫిలిం ప్రొడక్షన్స్ సుఖ మీడియా మూవీస్ పతాకంపై పొలిశెట్టి చిన్న దర్శకత్వంలో రూపొందుతున్న నారాయణ అండ్ కో చిత్రం జూన్ 30న విడుదల కానున్న సందర్భంగా చిత్ర బృందం శనివారం వివిఐటి కళాశాలను సందర్శించింది. ఈ కార్యక్రమంలో హీరో సుధాకర్ హీరోయిన్లు పూజ కిరణ్ యామిని విద్యార్థులతో కలసి డాన్సులు వేసి సెల్ఫీలు దిగారు. హీరో సుధాకర్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన హాస్యంతో అందరినీ అలరించే విధంగా ఈ చిత్రం రూపొందించబడిందని అన్నారు. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని, మంచి కుటుంబ కథ చిత్రమన్నారు. దర్శకుడు చిన్న మాట్లాడుతూ చిత్రంలోని ప్రతి సన్నివేశం హాస్యభరితంగా ఉంటుందని, త్వరలో విడుదల కానున్న ఈ చిత్రానికి మంచి విజయాన్ని అందించాలని కోరారు. కళాశాల ప్రిన్సిపల్ వై మల్లికార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశ చరిత్రపై కేంద్రం దాడి

- సరోజ్ చౌధురి స్మారకోపన్యాసంలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు



మాట్లాడుతున్న కేఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-గుంటూరు

ఒక వైపు చరిత్ర సబ్జెక్టుకు ప్రాధాన్యత తగ్గుతుంటే మరోవైపు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చరిత్రపై దాడి చేస్తూ, చరిత్రను వక్రీకరిస్తుందని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. శనివారం స్థానిక బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో ఇన్సూరెన్స్ ఉద్యమ జాతీయ నేత సరోజ్ చౌధురి స్మారకోపన్యాసం ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ యూనియన్ మచిలీపట్నం డివిజన్ అధ్యక్షులు జె.సుధాకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా 'మన దేశ చరిత్ర-ప్రాముఖ్యత- సవాళ్లు అనే అంశంపై జరిగిన సెమినార్‌లో లక్ష్మణరావు మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చాక పత పరంగా ప్రజలను చీల్చటానికి పెద్ద ఎత్తున కుట్రలు చేస్తుందని, అందుకు చరిత్ర అంశాలను ఉపయోగించుకుంటుందన్నారు. ఇటీవల కాలంలో ఎన్‌సిఇఆర్‌టి ఆధ్వర్యంలో రూపొందించిన పాఠ్యపుస్తకాలలో కోవిడ్ పేరుతో సిలబస్ కుదిస్తున్నామని చెబుతూ చరిత్ర పాఠ్యాంశాలను తగించారని, వాటిల్లో కూడా కొన్ని ప్రత్యేకమైన చాప్టర్లను తొలగించారన్నారు. డార్విన్ సిద్ధాంతాన్ని పక్కన పెట్టారన్నారు. స్వాతంత్ర్యం అనంతరం జమ్మూ కాశ్మీర్ దేశంలో విలీనం సందర్భంగా వచ్చిన 370 ఆర్టికల్, అంశాన్ని గోద్రా రైలు ఘటన, అనంతర గుజరాత్ అల్లర్లు అంశం, జాతిపిత మహాత్మా గాంధీని గాడ్సే హత్య చేసిన అంశాలు, ఇంకా అనేకం పాఠ్యాంశాల నుంచి తొలగించారని తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కోసమే చరిత్ర అంశాలను ఉద్దేశపూర్వకంగా తొలగించారని విమర్శించారు. మతోన్మాదం సమాజ మనుగడకే ప్రమాదమని, కావున దేశ లౌకిక భావనను కాపాడుకోవాలని కోరారు. సంఘ్ పరివార్ శక్తుల వ్యవహార శైలి వల్ల కర్నాటకలో హిజాబ్ సమస్య, గోద్రా ఘటన, బిస్కిస్ బానో కేసు వంటివి, మత స్వేచ్ఛ ప్రమాదంలో పడిందనటానికి ఉదాహరణలు అని అన్నారు. మత సామరస్యం, పరస్పర గౌరవం, ఐక్యత, సౌభ్రాతృత్వం వంటి మౌలిక లక్షణాల ఆధారంగా నిర్మించుకున్న మన వ్యవస్థను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్‌ఆర్ఐ మెడికల్ కాలేజి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.సత్యనారాయణ ప్రసాద్ మాట్లాడుతూ ఆధునిక టెక్నాలజీ వల్ల కలిగిన సౌలభ్యాన్ని వినియోగించుకుంటూనే చరిత్రను తెలుసుకోవాలని, అందులోని వాస్తవాలను గుర్తించాలని కోరారు. పుస్తక పఠనం పెంపొందించుకునేలా ప్రతి ఒక్కరూ తమ జీవన శైలిని మార్చుకోవాలన్నారు. ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ యూనియన్ మచిలీపట్నం డివిజన్ ప్రధాన కార్యదర్శి జి.కిషోర్‌కుమార్ మాట్లాడుతూ ఇన్సూరెన్స్ ఉద్యమానికి దాదాపు మూడు దశాబ్దాల పాటు సరోజ్ చౌధురి చేసిన విశేషమైన కృషిని వివరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎన్.వేణుగోపాలరావు, వివికె.సురేష్, వి.ఫణీంద్ర, జి.శివరామకృష్ణారావు, ఆర్.వి.ఎస్.శ్రీనివాస్, టి.అనసూయారాణి, ఎస్.ప్రసాద్, పి.శ్రీదేవి, ఐ.వెంకట్రావు, ఎం.రాజేశ్వరరావు, ఎన్.సువర్చలాదేవి, ఇన్సూరెన్స్ ఉద్యోగులు పాల్గొన్నారు.

దారిమళ్లుతున్న రేషన్ బియ్యం

వీక్షణం

జిల్లాలో రేషన్ బియ్యం దారిమళ్లుతున్నాయి. ఇటీవల కాలంలో రేషన్ బియ్యం రైస్ మిల్లర్లు ప్రయివేటు స్థావరాల్లో భారీగా నిల్వ ఉంచుతున్నారు. అడపాదడపా అధికారులు వీటిని పట్టుకుంటున్నా రేషన్ అక్రమ రవాణాను ఏమాత్రం నియంత్రించలేక పోతున్నారు. గత ప్రభుత్వ హయంలో రేషన్ బియ్యం దారి మళ్లాయని ఆరోపించిన వైసిపినాయకులు ఇప్పుడు అదేమార్గంలో ప్రయాణిస్తున్నారు.

రేషన్ అక్రమ రవాణాను నిరోధించేందుకు ఇంటింటికి రేషన్ సరఫరా ప్రవేశపెట్టారు. వాహనాల్లో ఇంటివద్దకు రేషన్ సరఫరా జరుగుతున్నా ఇందుకు సంబంధించి వాహనాల నిర్వాహకులే రేషన్ అక్రమ రవాణాలో కీలక భూమిక పోషిస్తున్నారు. బియ్యం కార్డు దారుల నుంచి బయోమెట్రిక్ తీసుకున్న తరువాత తూకం వేసి బియ్యం అందిస్తున్నట్టు ఆన్‌లైన్‌లో చూపుతారు.కానీ బియ్యం బదులు సొమ్ములు ఇచ్చిపంపుతున్నారు. ఎం.డి.యు. వాహన దారులు భారీ ఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నా ఇంతవరకు అధికారులు స్పందించడం లేదు. రేషన్ బియ్యం భారీగా వాహనాల్లో ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతంకు రవాణా అవుతున్నసమయంలోనే పోలీసులు,విజిలెన్సు అధికారులు ఎక్కువగా పట్టుకుంటున్నారు. కానీ వాహనదారులే కార్డు దారులకు బియ్యం బదులు సొమ్ము ఇచ్చి ఆన్‌లైన్‌లోనే అక్రమాలకు పాల్పడుతున్నా పౌరసరఫరాలశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ అధికారులు వాహనదారుల నుంచి నెలవారీ మామూళ్లు తీసుకుంటూ అక్రమాలపై దృష్టి సారించడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. వాహనాలు ఏర్పాటు చేసిన తరువాత ఇంటి వద్దే 84 శాతం మంది రేషన్ తీసుకుంటున్నారని ఎక్కడా అవతవకలకు ఆస్కారం లేదని పాలకులు చెప్పుకుంటున్నా రేషన్ మాఫీయా తన కార్యాకలాపాలను కొనసాగిస్తుంది. రేషన్ బియ్యాన్ని కాకినాడ, కృష్ణపట్నం పోర్టుల ద్వారా ఇతర రాష్ట్రాలు, దేశాలకు ఎగుమతి చేస్తున్నారని తెలిసింది. గతంలో కన్నా మెరుగైన బియ్యాన్ని ఇస్తున్నామని వినియోగదారులు వీటిని అన్నంగా వండుకుని భుజిస్తున్నారని చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా వున్నాయి. రేషన్ బియ్యాన్ని పాలిష్ పట్టి సన్నబియ్యంగా మార్చి నాణ్యమైన సరుకుగా చూపి ఎగుమతి చేస్తున్నారు. ప్రజల నుంచి వాహనదారుడే కిలో బియ్యం రూ.7 నుంచి రూ.8కి కొనుగోలు చేస్తున్నారు.వీరు వీటిని కిలో రూ.12లకు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. మిల్లర్లు వీటిని పాలిష్ చేసి కిలో రూ.40లకు విక్రయించే వాటిల్లో కలుపుతున్నారు. ఈ విధంగా రేషన్ అక్రమ వ్యాపారం యథేశ్చగా కొనసాగుతోంది. రకరకాల కారణాల వల్ల రైస్ తినడం తగ్గించడం వల్ల చాలా మంది నాణ్యమైన బియ్యంలో పాలిష్ పట్టిన రేషన్ బియాన్ని కలిపినా కనుగొనలేకపోతున్నారు. హోటళ్లు, మెస్‌లకు సరఫరా అయ్యే బియ్యంలో ఈ తరహా సరకు ఎక్కువగా విక్రయం జరుగుతోంది. జిల్లాలో ప్రజా ప్రతినిదుల అండతోనే రేషన్‌బియ్యం దారిమళ్లుతున్నాయనితెలిసింది. పలువురు ప్రజా ప్రతినిధులు బియ్యం ఇతర ప్రాంతాలకు ఎగుమతిలో కీలక భూమిక పోషిస్తున్నారు. గతంలోకొన్ని ప్రాంతాలకు పరిమితమైన అక్రమ రేషన్ వ్యాపారం ఇప్పుడు గుంటూరు, పల్నాడుజిల్లాల్లోని అన్ని ప్రాంతాలకు విస్తరించింది. సాంకేతికంగా ఎన్ని మార్పులు వచ్చినా అక్రమాలు మాత్రం ఏమాత్రం ఆగడం లేదు.

(ఎవిడి శర్మ)

నేడు సిఐటియు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-గుంటూరు :ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా నేడు సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రక్తదాన శిబిరాలను జయప్రదం చేయాలని కోరుతూ యూని యన్ కార్యకర్తలు నగరంలోని పలు ప్రాంతాల్లో కరప త్రాలు పంపిణీ చేసి, ప్రచార కార్యక్రమం నిర్వహిం చారు. స్థానిక జిటి రోడ్డులోని టింబర్ ముఠా కార్మికులు, ఆటో నగర్‌లోని అల్యూమినియం వర్కర్లు, సంజీవయ్య నగర్‌లోని భవన నిర్మాణ కార్మికుల వద్ద సిఐటియు నాయకులు రక్తదాన శిబిరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు నగర నాయకులు కె.శ్రీనివాసరావు, ఎస్.కె. జిలానీ, బి.వెంకటేశ్వర్లు, ఎస్.కె.హుస్సేన్, సాంబశివ రావు, దయానందం, పి.దీవెనరావు పాల్గొన్నారు. అదే విధంగా నల్లపాడు ఎస్సీ కాలనీలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ జిల్లా నాయకులు సలీం, సిఐటియు నాయకులు షేక్.ఖాసింవలి, ఆది నికల్సన్ అవగాహన కల్పించారు.

విద్యార్థులకు తక్షణం వసతులు కల్పించండి

అధికారులకు పల్నాడు జిల్లా కలెక్టర్ ఆదేశాలు

నరసరావుపేటలో ఎమ్మెల్యేతో కలసి పలు హాస్టళ్లు సందర్శన

ప్రజాశక్తి-నరసరావుపేట : పట్టణంలోని రైల్వే స్టేషన్ మొదటి గేట్ వద్ద ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి, పల్నాడు జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటితో శనివారం సందర్శిం చారు. అనంతరం విద్యార్థుల వసతి గదులను మరియు మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వార్డెన్ల విజ్ఞప్తి మేరకు విద్యార్థులకు కావాల్సిన సదుపాయాలను ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించారు. సంబంధిత అధికారులకు ఫోన్ చేసి తక్షణమే కావాల్సిన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. లింగం గుంట్ల, రెడ్డి నగర్ హాస్టల్స్‌ను మౌలిక సదుపాయా లను ఏర్పాటు చేయాలని సంబంధిత వార్డెన్లు వినతి పత్రం కలెక్టర్ కు అందించారు. కార్యక్రమంలో ఏ ఎస్ డబ్ల్యూ ఓ సంతోష్ కుమార్, హాస్టల్ వార్డెన్లు పాల్గొన్నారు.



వసతి గృహాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు